www.janasakthionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 47 సంచిక : 3 విజయవాడ 5-6-2014 పేజీలు : 8 వెల : రు 5.00


**మార్పును గమనించగలరు**

జనశక్తి వెబ్‌సైట్ అడ్రస్ www.janashaktionline.comకు బదులుగా www.janasakthionline.comగా మారింది. దయచేసి గమనించగలరు.

## తెలుగు ప్రజల మధ్య ఇంకా వైషమ్యాలను రగల్చజూస్తున్న దోపిడీ పాలకవర్గ పార్టీలపట్ల అప్రమత్తంగా ఉండండి!

## మౌలిక సమస్యల పరిష్కారానికై సంఘటితంగా పోరాడండి!

**రాష్ట్రంలో** ఎన్నికల పర్వం ముగిసింది. రాష్ట్రంలోని పెత్తందారీ వర్గాల మధ్య అధికారం కోసం తీవ్ర పోటీ సాగింది. ఈ పెత్తందారీ వర్గాలలో ఎక్కువభాగాన్ని కూడగట్టడంలోనూ, వారి సంకుచిత ప్రయోజనాలు నెరవేర్చగల హామీనివ్వటంలోనూ పైచేయి సాధించిన టిడిపి, టిఆర్ఎస్‌లు అధికారంలోకి వచ్చాయని పోలింగు సరళి, ఎన్నికల ఫలితాలూ తెలుపుతున్నాయి. తెలంగాణాలో కె.చంద్రశేఖరరావు ముఖ్యమంత్రిగా ప్రభుత్వం కొలువుదీరగా, ఆంధ్రప్రదేశ్‌లో మరికొద్ది రోజుల్లో చంద్రబాబు ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయనున్నది.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన ప్రక్రియను అంశాలవారీగా సాగిస్తున్నది. ఇరు రాష్ట్రాలకూ ఉద్యోగులను తాత్కాలికంగా పంపకం చేశారు. అదేవిధంగా విద్యుత్ పంపిణీ చేశారు. పోలవరం ముంపు గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలుపుతూ ఆర్డినెన్సు జారీ చేశారు. కృష్ణా, గోదావరి నదుల నిర్వాహక బోర్డులకు ఛైర్మన్లను కేంద్రం నియమించింది. కొన్ని ప్రభుత్వరంగ సంస్థల విభజన ప్రతిపాదనలూ ముందుకొచ్చాయి. కొన్ని సంస్థలను కొన్నేళ్ళపాటు సంయుక్తంగా నిర్వహించాలన్న నిర్ణయాలూ జరిగాయి. ఇరు రాష్ట్రాలలోనూ ప్రభుత్వాలు పనిచేయటం ప్రారంభిస్తేనే తప్ప విభజన ప్రక్రియ ముందుకు సాగని స్థితి ఏర్పడింది. ఇంతవరకూ సాగిన విభజన ప్రక్రియలోని ప్రతి అంశమూ వివాదాలకు దారితీసి, ప్రాంతీయ విభేదాలుగా మారాయి. రాబోయే కాలంలో విభజన ప్రక్రియ మరిన్ని వివాదాలకు అవకాశమిచ్చే విధంగానే సాగుతున్నది.

రెండు రాష్ట్రాలుగా ఏర్పడి మనుగడ సాగించాల్సిన స్థితిలో ఎన్నికలకు ముందూ, ఎన్నికల సమయంలోనూ, ఎన్నికల తర్వాత వున్న రాజకీయ పరిస్థితిని లోతుగా పరిశీలించినప్పుడే ఇరు రాష్ట్రాలలోనూ రాగల పరిణామాలను అర్థం చేసుకొనేందుకు తోడ్పడుతుంది.

### ఎన్నికల ముందు :

గత పదేళ్ళుగా, ప్రత్యేకించి తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తామని కేంద్రం ప్రకటన చేసిన తర్వాత ఐదేళ్ళ కాలంలో రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలన్నీ రాష్ట్ర విభజన చుట్టూనే తిరిగాయి. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోరుతూ ఉద్యమాలు ఒక ప్రాంతంలో సాగితే, దీనికి ప్రతిగా సమైక్య రాష్ట్రంగా కొనసాగించాలంటూ మిగిలిన ప్రాంతంలో ఉద్యమాలు సాగాయి. సాగునీటి సౌకర్య కల్పనతో వ్యవసాయాభివృద్ధి కావాలన్న, యువతకూ మెరుగైన ఉపాధి సౌకర్యాలు ఏర్పడాలన్న ప్రజాస్వామిక ఆకాంక్షలు ఇరువైపులా సాగిన ఉద్యమాలలో పాల్గొన్న ప్రజలలో వున్నాయి. రాష్ట్రం ఏర్పడిన ఆరు దశాబ్దాల కాలంగా ప్రజల ఈ ప్రజాస్వామిక ఆకాంక్షలను తీర్చకుండా అధికారం చెలాయించిన పాలకవర్గాలూ, వారి రాజకీయ ప్రతినిధులైన పాలకవర్గ పార్టీలూ, ఈ ఆకాంక్షలు ఈడేరక పోవటానికి పొరుగు ప్రాంతం వారే కారణమంటూ ప్రజలలో ప్రాంతీయ వైమనస్యాలను రెచ్చగొట్టారు. తెలంగాణాకు సాగునీరందకుండా ఆంధ్ర ప్రాంతానికే తరలించుకుపోయారనీ, ఉద్యోగాలన్నీ వారే ఆక్రమించుకున్నారనీ ఒకవైపునా; తెలంగాణా విడిపోతే ఆంధ్రా ఎడారి అవుతుందనీ, హైదరాబాదు పోతే ఉద్యోగాలుండవనీ మరోవైపునా ప్రజలలో ఆకాంక్షలను భావోద్వేగాలుగా మార్చి పొరుగు ప్రాంతంపై విద్వేషంగా మలిచారు. ప్రజల ఆకాంక్షలు తీరకపోవటానికి దోపిడీవర్గాల పాలనే కారణమన్న మౌలికాంశం నుండి ప్రజల దృష్టిని మళ్ళించారు. ఇంతేకాక, రెండవదశ ఆర్థిక సంస్కరణల పేరిట ప్రజల జీవితాలను, జీవనాధారాలను ఛిన్నాభిన్నం చేసి, దోపిడీవర్గాలకు దేశ సంపదను కట్టబెట్టే విధానాలను కాంగ్రెసు నల్లేరుపై బండిలా ఈ కాలంలో అమలు జరపగలిగిందంటే ప్రాంతీయ విద్వేషాలతో ప్రజల దృష్టిని మళ్ళించగలిగిన వారి కుట్ర ఫలితమే. (బాక్సైటు, ఇనుపఖనిజాల నిలువుదోపిడీ; పెట్రో కారిడార్, వాన్‌పిక్, విద్యుత్ కర్మాగారాల పేరిట రైతుల భూములు గుంజుకొనటం – వీటి మంచి చెడుల గురించి ఒక చర్చ లేకుండా కూడా నిరంకుశంగా అమలు జరిపింది ఈ కాలంలోనే) ఈ చర్యలతో ప్రజల నుండి వస్తున్న వ్యతిరేకతను చల్లార్చడానికి నిర్బంధంతోపాటు ఆరోగ్యశ్రీ, ఫీజు రీ యింబర్సుమెంటు వంటి పథకాలతో ప్రజలను జోకొట్టారు.

రాష్ట్ర విభజన సమస్యను రాజకీయ అజెండాలో ఏకైక అంశంగా పాలకవర్గాలు చేశాయి. ప్రజలెదుర్కొంటున్న మౌలిక సమస్యలనూ, వాటి పరిష్కారాలనూ రాజకీయ అజెండాలోకీ, చర్చలోకీ రాకుండా చేశాయి. తాము అమలుజరుపుతున్న ప్రజావ్యతిరేక చర్యలనే ప్రజల జీవితాలను స్వర్గతుల్యం చేసేవిగా చిత్రించాయి. దీనికోసం ప్రాంతీయ విబేధాలతోపాటు కుల, మత విబేధాలను రెచ్చగొట్టడాన్నీ జతచేశాయి.

### ఎన్నికల సమయంలో :

విభజన ప్రక్రియ ప్రారంభిస్తామని వాగ్దానం చేసిన ఐదేళ్ళదాకా, రాష్ట్రంలో ప్రాంతీయ వైషమ్యాల రెచ్చగొట్టుడును సాగనిచ్చి, ఎన్నికలకు మందు రాష్ట్ర విభజన చట్టాన్ని చేసి ఎన్నికల్లో లబ్ధిపొందే ప్రయత్నం కాంగ్రెసుపార్టీ చేసింది. ఎన్నికలు రావటంతో తెలంగాణా యిచ్చింది నేనని కాంగ్రెసు, తెలంగాణా తెచ్చింది నేనని టిఆర్ఎస్, మా మద్దతు లేకుంటే తెలంగాణా సాధ్యమయ్యేదికాదంటూ బిజెపిలు మాకే ఓట్లేయమంటూ తెలంగాణా ప్రాంతంలో విభజననే ఎన్నికల్లో ఏకైక రాజకీయ అంశంగా మార్చాయి. ఇటు ఆంధ్ర, రాయలసీమలలో సమైక్యాంధ్ర నినాదంతో జగన్‌పార్టీ, కిరణ్‌కుమార్‌రెడ్డి పార్టీలూ, ఇరు ప్రాంతాలకూ సమన్యాయం పేరిట టిడిపి – విభజన సమస్యనే ఎన్నికల అజెండాగా చేసాయి. ఇరు రాష్ట్రాలలోనూ ప్రజలెదుర్కొంటున్న మౌలిక సమస్యలనూ, వాటి పరిష్కారాలను గురించి చర్చ జరగకుండా చేశాయి.

ప్రభత్వం అప్పటివరకూ అమలుచేసిన విధానాల మంచి చెడులను చర్చించటం, వివిధ రాజకీయపక్షాలు తమ ప్రత్యామ్నాయ విధానాలను సూచించటం, వీటిని పరిశీలించటం అన్నది ఒక ప్రజాస్వామిక విధానం. ఎన్నికలు దీనికొక సందర్భం. కాగా పాలకవర్గ పార్టీలు ఈ ప్రజాస్వామిక ప్రక్రియనే ఒక అపహాస్యంగా చేశాయి. తమ పాలనా కాలంలో అనుసరించిన విధానాలనూ, అవి ప్రజా జీవితంపై పడవేసిన ప్రభావాన్ని చర్చలోకి రాకుండా చేశాయి. తాము నిర్ణయించిన రాష్ట్ర విభజన సమస్యనే రాజకీయ అజెండాగా చేశాయి. ప్రజలెదుర్కొంటున్న మౌలిక సమస్యలను, వాటి పరిష్కారాలను అజెండాలోకి రాకుండా చేసాయి.

(తరువాయి 4వ పేజీలో)

## సిపిఐ(ఎం-ఎల్) పిలుపు

### మౌలిక సమస్యల పరిష్కారంకొరకు సంఘటిత పోరాటాలకు సంసిద్ధంకండి!
### విభజించి-పాలించే పాలకవర్గ కుట్రలకు బలికాకండి!
### కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే శక్తులపట్ల మెలకువ కలిగి వుండండి!

**ఆంధ్రప్రదేశ్‌లో** మూడు స్థాయిల్లో(పంచాయతీరాజ్ – మండల, జిల్లాపరిషత్, మునిసిపల్; శాసనసభ, లోక్‌సభ) మూడు నెలలపాటు సాగిన ఎన్నికలు ముగిసాయి. తెలంగాణాలో టిఆర్ఎస్ అధికారంలోకి రాగా, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి అధికారంలోకి వచ్చింది. అధికారం పొందిన పార్టీకీ దానితో పోటీపడిన ప్రధాన పార్టీకీ వచ్చిన ఓట్లలో తేడా దాదాపు 2శాతంగా వుంది. కొద్దిపాటి ఓట్ల తేడాతో సీట్లలో భారీ తేడాతో అధికారంలోకి రావటం ఈ రాష్ట్రంలో గత ఎన్నికల్లో తరచుగా జరిగింది. అందువల్ల ప్రస్తుత ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యాన్ని కలిగించవు. అయితే కాంగ్రెసుకు మొదటి నుండి కంచుకోటగా వుంటూ వచ్చిన ఆంధ్రప్రదేశ్‌లో, విభజిత రెండు రాష్ట్రాలలో కూడా దాని ఓట్లశాతం ఒకే అంకె స్థాయికి పడిపోయింది. ఆంధ్ర ప్రాంతంలో అసలు ఒక్క సీటుకూడా గెలుపొందకపోగా చాలా చోట్ల దాని అభ్యర్థులు డిపాజిట్టుకూడా కోల్పోయారు.

విభజనవల్ల ఏర్పడనున్న రెండు రాష్ట్రాలలోనూ విభజనే ప్రధాన రాజకీయ అజండా అయింది. తెలంగాణా తెచ్చింది నేను, ఇచ్చింది నేను అంటూ టిఆర్ఎస్, కాంగ్రెసులు ప్రజల మౌలిక సమస్యలేవీ చర్చలోకి రాకుండాచేసి, రాజకీయ ప్రచారాన్నంతా విభజన చుట్టూనే తిప్పారు. కొత్త ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్ కాంగ్రెసు సమైక్యాంధ్ర నినాదంతోనూ, సమన్యాయం పేరిట టిడిపి విభజన చుట్టూనే రాజకీయ ప్రచారాన్ని పరిమితం చేశారు. ప్రజల మౌలిక సమస్యలనూ, వాటి పరిష్కారాలనూ చర్చలోకి రాకుండా చేశారు.

రెండు రాష్ట్రాల్లోకూడా "అభివృద్ధి" మంత్ర జపం చేశారు. తెలంగాణా పునర్నిర్మాణమని టిఆర్ఎస్, తెలంగాణా నవనిర్మాణమని కాంగ్రెసు, స్వర్ణాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి అని టిడిపి, రాజన్న రాజ్యం తెస్తామంటూ వైసిపి ఊదరగొట్టారు. ఇంతకీ ఆ అభివృద్ధి తీరు తెన్నులేమిటో ఈ పార్టీలు ప్రజలకు వివరించలేదు. ఇక ఆ అభివృద్ధిలోని మంచి చెడ్డల గురించిన చర్చకు అసలు స్థానమేలేదు.

ఇక వాగ్దానాల వర్షం కురిపించటంలో ఎవరూ వెనుకబడలేదు. రైతుల బ్యాంకు రుణాల మాఫీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, 9 గంటల నిరంతరాయ సరఫరా, డ్వాక్రాగ్రూపు మహిళల రుణాల రద్దు; కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంటు చేయటం; ఉద్యమాలలో పాల్గొన్న ఉద్యోగులకు ఇంక్రిమెంటు, ఎదురుపడిన ప్రతి ఒక్కరికీ, ప్రతి వర్గానికీ, ప్రతి సెక్షనుకూ వాగ్దానాలు చేశారు. ఈ సమస్యలు తలయెత్తడానికి కారణం తామనుసరించిన విధానాలేనన్న వాస్తవాన్నీ, వాటిని మార్చబోరన్న వాస్తవాన్నీ ప్రజల దృష్టిలోకి రాకుండా చేసేందుకే ఈ వాగ్దానాల వర్షం. వీటితో ప్రజలలో భ్రమలు కల్పించి, సహాయమిచ్చే నాయకులకోసం ఎదురు తెన్నులు చూసే స్థితిలో ప్రజలనుంచేందుకే ఈ వాగ్దానాలు చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లోని పార్లమెంటరీ పార్టీలకు పరోక్షంగా టివి ఛానెళ్లు, పత్రికలూ వున్నాయి. వైసిపికి స్వంత పత్రిక, టివి ఛానెళ్ళు వున్నాయి. ఇదికాక చాలామంది పాలకపార్టీల నాయకులు బినామీగా టివి ఛానెళ్ళను కలిగి వున్నారు. ఎన్నికలు ముగిసేవరకూ టివి ఛానెళ్లను బినామీగా అద్దెకు తీసుకున్న ఘటనలూ వున్నాయి. సమాచార సాధనాలపై ఈ గుత్తాధిపత్యంతో తాము నిర్ణయించిన రాజకీయ అజండాతోనే వాతావరణాన్ని నింపివేశాయి. చిన్న పార్టీలకూ, ప్రజాస్వామిక శక్తులకూ పాలకవర్గ పార్టీలతో పోటీపడి ఖర్చుచేస్తే తప్ప కనీసం ఉనికిని చూపెట్టుకునే ప్రచారం చేసుకోలేని స్థితిని కల్పించారు. ఎన్నికలను ప్రజాస్వామ్యయుతంగా నడుపుతానంటూ ఎలక్షను కమీషను తీసుకున్న చర్యలన్నీ చిన్న పార్టీలకూ ప్రజాస్వామిక శక్తులకూ ప్రతిబంధకాలయ్యాయి తప్ప పాలకవర్గ పార్టీలు డబ్బు, సారా ప్రవహింపచేయటాన్ని ఏమాత్రం అడ్డుకోలేకపోయాయి.

ఇంతచేసినా, చివరికి ఎన్నికల ఫలితాలను చూసినప్పుడు రాష్ట్రంలో స్తానిక పెత్తందారీ ముఠాల పెద్దలను ఎక్కువ కూడగట్టిన పార్టీయే ఆ ప్రాంతంలో విజయం సాధించిందని స్పష్టమైంది. ఫ్యూడల్ ఆధిపత్య సంస్కృతి ప్రభావం వున్న గ్రామీణ ప్రాంతంలోని సాంఘిక వైరుధ్యాలు, సంఘర్షణలను ఉపయోగించుకోవడం దోపిడీపాలక వర్గాలకు వెన్నతోబెట్టిన విద్య.

గత ప్రభుత్వాల విధానాలతో జీవనం కష్టభరితమై, ప్రజలలో అశాంతి పేరుకున్నది. ఆగ్రహం పెల్లుబుకుతున్నది. ఈ వాస్తవాన్ని గమనించిన పాలకవర్గ పార్టీలు ఒకవైపున తాత్కాలిక ఉపశమనాలు కల్గించే వాగ్దానాలతో వారి ఆగ్రహంపై నీరుజల్లే పనిలో నిమగ్నమయ్యాయి. అదే సమయంలో ప్రజల జీవనం, జీవనాధారాలతో స్థానిక పెత్తందారీ ముఠాలకున్న ఆర్థిక, సామాజిక బంధనాలను వినియోగించుకోవడంలో పోటీపడ్డాయి. అందువల్లనే ఎంత అశాంతివున్నా జీవనభద్రతకోసం ఈ పెత్తందారీ వర్గాల గిరిలోనే ప్రజలు ఓటు వేయవలసిన పరిస్థితి ఏర్పడింది.

(తరువాయి 2వ పేజీలో)

# జస్టిస్ పిఏ చౌదరికి జోహార్లు

**1926లో** గుంటూరుజిల్లా-బాపట్ల తాలూకా, నర్సాయపాలెంలో జన్మించిన పత్తిపాటి అంకమ్మ చౌదరి(88 సం౹౹లు) 2014 మే 17న హైదరాబాదులో మరణించారు. రైతాంగ కుటుంబ నేపధ్యంనుండి వచ్చిన ఆయన, న్యాయమూర్తిగా పనిచేసిన కాలంలో హేతుబద్ధంగా, మానవతావాద దృష్టితో అనేక తీర్పులిచ్చారు.

13 రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు సంయుక్తంగా వ్యవసాయరంగ పరిరక్షణ ఐక్యపోరాట వేదికగా ఏర్పడి, 2000 సం౹౹లో రైతుల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిషన్‌ను ఏర్పరిచాయి. ఈ కమీషన్‌కు జస్టిస్ పి.ఏ. చౌదరి అధ్యక్షునిగా వ్యవహరించారు. కమిషన్ సభ్యులతో కలసి అనేక జిల్లాలలో పర్యటించి, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి, ఒక విలువైన నివేదికను రూపొందించటంలో ఆయన కృషి వుంది. తదనంతర కాలంలో రాష్ట్ర రైతాంగ సమస్యలపై జయతీఘోష్ రూపొందించిన నివేదికకు నిపుణుల కమిషన్ నివేదిక ఒక ప్రాతిపదికగా పనిచేసింది.

జస్టిస్ పి.ఏ.చౌదరి మృతికి 'జనశక్తి' సంతాపం ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తోంది.

# హూల్ ఝూర్ఖండ్ క్రాంతిదళ్ జిల్లా మహాసభ

**2014** ఫిబ్రవరిలో రాంచీలో 'హూల్ ఝూర్ఖండ్ క్రాంతిదళ్' జిల్లా మహాసభ జరిగింది. విప్లవ గీతాల నడుమ తొలుత అమరవీరులందరికీ సభ నివాళు లర్పించింది. జస్వా కాశ్యప్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా కార్యదర్శి శాని పుష్పభోగ్తా రాజకీయ నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఏఐకెఎమ్‌కెఎస్ నాయకులు కా౹౹ శంభుమహతో, ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా౹౹ కమల్ కిషోర్ యాదవ్, మరియు ఇతర ప్రజాసంఘాల నాయకులు ఈ సభలో ప్రసంగించారు.

వక్తలు తమ ప్రసంగాల్లో – ఝూర్ఖండ్‌లో వివిధ రైతాంగ సంస్థలు, ఝూర్ఖండ్ పార్టీలుగా చెప్పబడేవి చురుగ్గా వున్నాయి. కానీ అందరూ రైతాంగ సమస్యలను దాటవేస్తున్నారు. 'హూల్ ఝూర్ఖండ్ క్రాంతిదళ్' సంస్థ మాత్రమే ఆదివాసులను, దళితులను, భూమిహీనులను, నిరుపేద రైతులను వారి సమస్యలపై సంఘటితపరుస్తున్నది. ఆదివాసుల భూములు తిరిగి ఆదివాసులకు అప్పగించాలని ఆందోళనలు, అడవి రక్షణ మరియు కనీస వేతనాల సమస్యలపై ఆందోళనలు ఇందులో భాగమే. కనుక హెచ్‌జెకెడి ఈ ఆందోళనోద్యమాలతో మమేకమవటంతోపాటుగా, బర్మాజి, అంగడా, నంకుమ్, కకే, రథు, సిల్లి, సిమిదరి, సదర్‌రాంచి, ఛందోలనాలలో మాఫియాలకు, గూండాలకు వ్యతిరేకంగా సాగే పోరాటాలలో భాగస్వామిగా వుంది. ఈ మధ్యకాలంలో కొంత విచ్చిన్నానికి గురైనా నిలదొక్కుకుని చురుగ్గా కార్యక్రమాలు సాగిస్తోంది. నాయకత్వంపై విశ్వాసంతో సంఘ సభ్యులంతా క్షేత్రస్థాయిలో సంస్థ బలోపేతానికి విశేషంగా కృషిసాగిస్తున్నారు.

రాష్ట్ర రాజధానీ నగరమేకాక, రాంచీ అనేక ఆందోళనల, పోరాటాల సమాహారంకూడా. పాలక పార్టీలు తమ రాజకీయ క్రీడలో భాగంగా ఈ సమస్యలను వుపయోగించేందుకు సంసిద్ధ మవుతున్నాయి. విస్థాపన, భూమిహీనులకు భూమి, సంక్షేమ కార్యక్రమాలలో అవినీతి, మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం విస్తరించటం మొదలైన కీలకమైన సమస్యల గురించి వారెవరూ పట్టించుకొనే స్థితిలో లేరు. ఝూర్ఖండ్‌లో ప్రపంచీకరణ విధానాల ఫలితంగా పరిశ్రమల మూసివేత, కార్మికుల తొలగింపు వంటి సమస్యలు ఝూర్ఖండ్‌లో తీవ్రమయ్యాయి. ప్రైవేటీకరణ విధానాలతో విద్య, వైద్యం, విద్యుత్తు, తాగునీరు, రవాణా, నిత్యావసర వస్తువుల ధరలు అనూహ్యంగా పెరిగిపోయాయి. అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. భూగర్భ సంపదల లూటీ తీవ్రమైంది. 'అభివృద్ధి' అనే పదం వింటేనే పేదప్రజానీకం భయంతో వణికిపోయే పరిస్థితి ఏర్పడింది.

రాంచీ పట్టణం కూరగాయల ఉత్పత్తికి పేరెన్నికగన్నది. కానీ బడా వ్యాపార కంపెనీలు ఈ మార్కెట్టునంతా తమ గుప్పెటలోకి తీసుకున్నాయి. కూరగాయలు పండించిన రైతుల ఉత్పత్తులకు హేతుబద్ధమైన ధరలు కూడా లభించటంలేదు. వారంతా రుణభారంలో చిక్కుకుపోయారు. వారిలో కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కనుక, బాధితులైన వీరందరి ఐక్యతను, పోరాటాన్ని ప్రస్తుత పరిస్థితులు డిమాండ్ చేస్తున్నాయి. కార్మికులు, రైతాంగం సాగిస్తున్న పోరాటాలకూ, అస్తిత్వ సమస్యమై సాగుతున్న ఆందోళనలనకూ నడుమ ఎలాంటి సంబంధమూ, సమన్వయమూ లేదని వక్తలు పేర్కొన్నారు.

ఈ మహాసభ ఏకగ్రీవంగా జిల్లాకమిటీని ఎన్నుకుంది. నూతనంగా ఎన్నికైన హెచ్‌జెకెడి అధ్యక్షులు బీర్సా హేంబ్రమ్ మాట్లాడుతూ నీరు, అడవి, భూమి మరియు ఇతర వనరులన్నీ నిరంతరాయంగా ఆదివాసుల నుండి, మూలవాసుల నుండి గుంజివేసుకోబడుతున్నాయన్నారు. ప్రతినిధులు గ్రామాలకు వెళ్ళాలనీ, ఈ సమస్యపై ప్రజలనందరినీ ఐక్యం, సంఘటితం చేయాలనీ పిలుపునిచ్చారు. వారి పోరాటంలో 'ఫిసా' చట్టాన్ని, రాజ్యాంగంలోని 5వ షెడ్యూలును – తమ ఆయుధాలుగా ఉపయోగించాలన్నారు. బీర్సాముండా చూపిన మార్గంలో నూతన ఉషోదయం దిశగా ముందుకే సాగుదామనే నినాదంతో ఈ సభ ముగిసింది. ✡

# ప్రొద్దుటూరు తొలితరం కమ్యూనిస్టుల సంస్మరణ సభ



అమరుల స్థూపం వద్ద నివాళులు

**ప్రొద్దుటూరు, 24-5-'14 :**

కృష్ణాజిల్లా ప్రొద్దుటూరు గ్రామంలోని తొలితరం కమ్యూనిస్టుల స్థూపంవద్ద వారి సంస్మరణ సభ జరిగింది. నరేంద్రమోడి సారధ్యం వహిస్తున్న బిజెపి అధికారంలోకి రావటం, సామ్రాజ్యవాద, విదేశీశక్తులకు ఎర్రతివాచీ పరచటమేనని ఈ సభలో ముఖ్యవక్తగా పాల్గొన్న సిపిఐ (యం.యల్) కృష్ణాజిల్లా కార్యదర్శి కా౹౹ ముప్పాళ్ళ భార్గవశ్రీ పేర్కొన్నారు. ఆయన తన ఉపన్యాసంలో, తొలితరం కమ్యూనిస్టులు ప్రాణాలకు తెగించి ఏ ఆశయాల కోసం పోరాడారో ఆ ఆశయాలను మనమింకా సాధించాల్సిన దశలోనే వున్నామనీ, ఆనాడు నిర్బంధ కాలంలో చల్లపల్లి నారాయణరావు లాంటి కామ్రేడ్స్‌ను కాల్చిచంపినా, ఎలమర్రు – కాటూరులలో పోలీసుల పాశవిక చిత్రహింసలను తట్టుకొని ప్రజలు కమ్యూనిస్టులను తమ గుండెలలో పెట్టుకొని కాపాడారనీ, ఆ త్యాగాలు ఎన్నటికీ వృధాపోవనీ, కమ్యూనిస్టు సిద్ధాంతాలు వ్యవస్థ మార్పుకి దిక్సూచిగా పనిచేస్తాయనీ, మార్పు అనివార్యమనీ, అయితే నాయకత్వం వహించాల్సిన కమ్యూనిస్టుశక్తులు చీలికలను అధిగమించి దృఢమైన శక్తిగా ఆవిర్భవించాలనీ, అంతేగాక ప్రజలపై నానాటికీ భారాలు పెంచుతున్న ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలపై కమ్యూనిస్టు, విప్లవశక్తులతోపాటు దేశభక్తియుత, ప్రజాతంత్రశక్తులు ఒకే వేదికమీదకు వచ్చి నిరంతరం పోరాటాలు సాగించటానికి సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

సంస్మరణసభ కార్యక్రమం ప్రారంభంలో అమరుల స్థూపంవద్ద వున్న ఎర్రజెండాను కా౹౹ భార్గవశ్రీ ఆవిష్కరించారు. తర్వాత తొలితరం కమ్యూనిస్టులు కామ్రేడ్స్ సూర్యదేవర గోపాలరావు, భీమవరపు కృష్ణారెడ్డి, భీమవరపు వెంకటరెడ్డి, మండేపూడి నాగయ్యరెడ్డి, ఈడా సాంబమూర్తి అమర స్థూపానికి స్థూపనిర్మాణ కమిటీ నాయకులు కా౹౹ ఈడా అక్కతాతయ్య, భీమవరపు గురవారెడ్డి, ఈడా వీరాస్వామి, భీమవరపు బసివిరెడ్డి, పలసాని అంజయ్య, కూకట్లపల్లి సెబాస్టియన్ తదితరులు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

సభానంతరం గ్రామంలోని హైస్కూలు 10వ తరగతిలో ఎక్కువ మార్కులు వచ్చిన ముగ్గురికి బహుమతులతోపాటు మంచి సాహిత్య పుస్తకాలను, మే 22, 23 తేదీల్లో నవయువసమాఖ్య నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలైన వారికి బహుమతులను అందజేశారు. ✡

**సిపిఐ(ఎం-ఎల్)...**(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించు కున్నారన్న ప్రచారంలో నిజం నేతిబీరలో నెయ్యివంటిదే.

రాష్ట్రవిభజన సమస్యను సాగలాగి పదేళ్లపాటు పాలకవర్గ పార్టీలు ప్రజల మౌలిక సమస్యలనూ, వాటి పరిష్కారాలనూ ప్రక్కనబెట్టాయి. 2011లో వచ్చిన వరదలూ, అతివృష్టితో నష్టపోయిన రైతాంగానికి అందిస్తామన్న సహాయానికి కేంద్రం నుండి నిధులు వచ్చినా ఈనాటికీ పంపకం చెయ్యకుండా ప్రభుత్వ నేతలు ఊరకుండిపోయారంటే తక్షణ సహాయ చర్యలను కూడా ఎలా దాటవేశారో అర్థమౌతుంది. ఎన్నికలు ముగిసాయి గనుక చేసిన వాగ్దానాలకు ఎగనామం పెట్టే మార్గాల వెతుకులాటలో పడ్డాయి. రైతుల బ్యాంకు రుణాలమాఫీని వీలయినంతగా తగ్గించుకునేందుకు చూస్తున్నాయి. అదే సమయంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలలో ఏ ఒక్కదానికీ పరిష్కారం చూపటంలేదు. వాటికి మూలకారణమైన గత ప్రభుత్వ విధానాలు మార్చుతామన్న ఉద్దేశ్యాన్ని కూడా తెలపటంలేదు.

కాగా రాష్ట్రవిభజన ప్రక్రియలో వస్తున్న ప్రతి అంశాన్నీ రెండు రాష్ట్రాలలోనూ భావోద్వేగాల సమస్యగా మారుస్తున్నారు. ఉద్యోగుల కేటాయింపు, విద్యుత్తు పంపకం, నదీ జలాలు, పోలవరం ప్రాజెక్టు ప్రతిదీ ఇరురాష్ట్రాల ప్రజలమధ్య వైమనస్యాలు రెచ్చగొట్టే సాధనంగా మారుస్తున్నారు. మౌలిక సమస్యల నుండి ప్రజల దృష్టి మళ్లించి, తమ సామ్రాజ్యవాద, బడా బూర్జువా, బడా భూస్వామ్య అనుకూల విధానాలను నల్లేరుపై బండిలా అమలుజరిపేందుకే కుల, మత, ప్రాంతీయవిద్వేషాలు రగిలించటాన్ని కొనసాగిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో పాలకవర్గాలూ, వారి రాజకీయ పార్టీలు సాగిస్తున్న కుట్రలను ప్రజలకు వివరించి, పాలకవర్గాల పన్నిన ఉచ్చులో ప్రజలు పడకుండాచూసే కర్తవ్యం ప్రజాస్వామిక శక్తులపైనా, విప్లవకారులపైనా వున్నది. పాలకులు రగుల్చుతున్న విద్వేషాలను అధిగమించి ప్రజలమధ్య ఐక్యతను కాపాడవలసిన కర్తవ్యం మనముందు వుంది. ప్రజలలో పేరుకున్న అశాంతిని మౌలిక సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలుగా మలచవలసిన బృహత్తర కర్తవ్యం మనముందు వున్నది. ఈ కర్తవ్యాల నిర్వహణకు ప్రజాస్వామిక శక్తులూ విప్లవకారులూ సంసిద్ధం కావాలని పిలుపునిస్తున్నాము.

పాలకవర్గాల కుట్రలకు, వాగ్దానాలకు మోసపోకుండా, మౌలిక సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలకు సన్నద్ధులు కమ్మని తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు పిలుపునిస్తున్నాము.

**2-6-14** **సిపిఐ(ఎం-ఎల్)**

**రాష్ట్రకమిటి**

**జూన్ 12 - లక్షింపేట...** (3వ పేజీ నుండి)

ఆ దళితులకు ప్రయోజనం చేకూరుస్తుందా అనేది పరిశీలించుకోవాల్సిన అంశం. కాగా, దురదృష్టమైన మరో అంశమేమంటే, విప్లవ కమ్యూనిస్టులుగా చెప్పబడే వారు, ఆయా విప్లవ ప్రజాసంఘాలకు ప్రాతినిధ్యం వహించే మరికొందరు కూడా ఈ దాడులను త్రిప్పికొట్టలేకపోగా, ఈ తరహా భావజాల ప్రచారంపట్ల సానుకూలంగా వ్యవహరిస్తూ అది తమకు సంబంధించిన విషయం కాదన్నట్లుగా వ్యవహరించటం మరింత అభ్యంతరకరం. కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచార ప్రభావానికి లోనైనవారు, మిడిమిడి జ్ఞానంతోనున్న విద్యాధికులు కొందరు కూడా ఇదే ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఏ ఒక్క చోటనైనా దళితుల సమస్యలపై నిర్దిష్ట కార్యాచరణ కాదుగదా నిలకడగా వారిని అంటిపెట్టుకొని వుండటమనే కనీసపాటి అంకితభావంలేని మరికొందరు, కమ్యూనిస్టులపై దుమ్మెత్తిపోయటానికి మాత్రం ఉబలాటపడిపోతున్నారు. కమ్యూనిస్టులను తూలనాడటమే ఫ్యాషన్‌గా మార్చుకున్నారు.

అంటే, కమ్యూనిస్టుల కార్యాచరణను సిద్ధాంత అవగాహనలను చారిత్రకంగా అర్ధం చేసుకొని, చీలికలకు గురైవున్న నేటి దశలో నాయకత్వాలపై, వారి ఆచరణలపై నిర్మాణాత్మకంగా నిజాయితీతో నిర్దిష్టంగా విమర్శ చేయటం సరైనదే. ఇలాంటి విమర్శ చేయాలంటే మొదట పరిశీలన, అధ్యయనం వీటన్నింటిని మించి – కలిసి ప్రయాణం చేయాల్సిన వారిపై సాగించే దాడి, దోపిడీవర్గ ప్రయోజనాలకు తోడ్పడుతుందనే స్పృహ వున్నప్పుడు, కమ్యూనిస్టులపై విమర్శ కూడా తన రూపాన్ని, వేదికను మార్చుకుంటుంది. దళిత, విప్లవశక్తుల మధ్య ఐక్యత గాఢతరం కాకుండేందుకే కొన్ని దోపిడీ శక్తుల ప్రోత్సాహ ప్రోద్బలాలతో దీనికి గండికొట్టే ప్రయత్నం దురుద్దేశపూర్వకంగా సాగుతోందని ఎరుకతో గమనించాలి. అప్రమత్తంగా వ్యవహరించాలి. అలాంటి శక్తులను జాగ్రత్తగా వేరుచేయాలి.

'పుట్టుకే' గుణాన్ని నిర్ణయిస్తుందన్న మనుధర్మ శాస్త్రాన్ని తిరస్కరిస్తున్నామంటున్న మరికొందరు దళితనేతలు, 'అగ్రకులంలో' పుట్టిన వారందరినీ విచక్షణారహితంగా ఒకే గాట్నకట్టేస్తున్నారు. అగ్రకులాలలోని సానుభూతిపరులు, అభివృద్ధి కాముకులు, ప్రజాస్వామికవాదులను కూడా తెలిసో తెలియకో అగ్రకుల, దోపిడీవర్గాలవైపు నెట్టివేసే ఈ ధోరణులు నష్టదాయకంగా వున్నాయి. అదేవిధంగా పుట్టుకతో దళితుడై వుండికూడా పీడిత దళితుల పక్షాన గీతగీచి నిలబడకుండా పాలకపార్టీల, అగ్రకుల పెత్తందార్ల పక్షంవహిస్తున్న 'దళిత నేతలు'గా చెప్పబడే వారిపట్ల ఖచ్చితమైన విమర్శనాత్మక వైఖరితో ఉండవలసిన అవసరం ఎంతైనా వుంది. ఏమైనా, పీడిత, దళిత ఉద్యమాల పట్ల సాధ్యమైనంత ఎక్కువమందిని సమీకరించుకునేవైపుగా, అగ్రకుల, ఆధిపత్య, దోపిడీశక్తులను ఒంటరిచేసే విధంగా వ్యవహరించటమే మొత్తంగా పీడితవర్గ, ప్రజాఉద్యమాల పురోగమనానికి తోడ్పడుతుందనేది సత్యం.

\ \ \

ఎంతగా అభివృద్ధి సాధించామని పాలకులు గొంతులు చించుకొంటున్నా, గ్రామీణ భారతంలో ఫ్యూడల్ సంబంధాలు నేటికీ బలంగా వున్నాయనేది కాదనలేని వాస్తవం. విశాల భూఖండాలు భూస్వాముల ఆధీనంలో వున్నాయి; లేదా వారి పెత్తనంలో వున్నాయి. అదేవిధంగా ఆయా గ్రామాలలో అధిక సంఖ్యలోనున్న ప్రజానీకం – ముఖ్యంగా దళితులు, మైనారిటీలు, ఇతర బలహీనవర్గాల ప్రజానీకం వారి భూములపై ఆధారపడి, వారి కనుసన్నలలో జీవితాలను గడప వలసిన దయనీయ పరిస్థితులలోనే జీవిస్తున్నారన్నది వాస్తవం. దీనికి భిన్నంగా – దళితులు విద్యనభ్యసిస్తే, తెల్లబట్టలు ధరిస్తే, తమతో సమంగా ప్రయాణిస్తే, 'మంచి' ఉద్యోగాలు సంపాదించుకుంటే, తమ భూములలో గతంలోలాగా 'వెట్టి'చాకిరీ చేయనిరాకరిస్తే, అగ్రకుల యువతులతో ప్రేమ, పెళ్ళి సంబంధాలలోకి వెళితే ముఖ్యంగా భూమిపై హక్కును కోరుకుంటే, అందుకు ఆచరణలోకి దిగితే భూస్వామ్య అగ్రకుల దురహంకారం పడగ విప్పుతోంది. ఈ భూస్వాముల, పెత్తందారుల, అగ్రకుల దురహంకారుల పెత్తనం, అధికారం నిబిడీకృతమై వున్న భూమి సంబంధాలను బ్రద్దలుకొట్టకుండా అంటే, 'దున్నేవానికే భూమి' సాధించబడకుండా, ఈ వైరుధ్యం పరిష్కారం కాదనేది స్పష్టం. కనుక ఈనాటికీ రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో అమలవుతోన్న అంతరానితనం, రెండు గ్లాసుల విధానం, కులవివక్ష, వివిధ రూపాల్లో వెట్టిచాకిరీ, దళితులపై దాడులు; దౌర్జన్యాలు, దళిత మహిళలపై అత్యాచారాలు, హత్యలు వంటి అన్నిరకాల ఫ్యూడల్ అణచివేతలకు పీడనలకు వ్యతిరేకంగా ఆధిపత్య కులదురహంకార శక్తుల నుండి విడగొట్టుకొని అన్ని కులాల్లోని పీడితులు, శ్రమజీవులైన పేదలు, కులద్వేషాలకు గురికాకుండా, దళిత శక్తులతో కలసి దీర్ఘకాల ఐక్య ఉద్యమాలు నిర్మించాలి. ✡

**అణచబడ్డ దళితులంతా తిరగబడండి**

పేజీలు : 144

వెల : రు. 50/-

కాపీలకు : **మైత్రీబుక్‌హౌస్**

**జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,**

**విజయవాడ-2**

# జూన్ 12 లక్షింపేట దళితులపై హంతకదాడికి రెండేళ్ళు

## లక్షింపేట, చుండూరులు గతంకాదు; మానని వర్తమాన గాయాలు

ఎస్. ఝాన్సి



**శ్రీకాకుళం** జిల్లా లక్షింపేటలో దళితులపై కుల దురహంకార పెత్తందారులు దాడిచేసి, ఐదుగురిని బలిగొని, రెండు సంవత్సరాలు నిండాయి. కుల దురహంకారుల దాడులలో అసువులుబాసిన మృతవీరులకు జోహార్లర్పిద్దాం. లక్షింపేట దళితులు అంతకు మునుపు చాలా కాలం నుండీ ఏ ప్రభుత్వ భూములను సాగుచేస్తూ వున్నారో, ఏ భూముల కోసం నిలబడిన కారణంగా కాపు కుల దురహంకారులు ఐదుగురు దళితుల నిండు ప్రాణాలను బలిగొన్నారో... ఆ భూముల సమస్యను ప్రభుత్వం ఈనాటికీ పరిష్కరించలేదు. నష్టపరిహార ప్రకటనలు, కంటితుడుపు విదిలింపులకు మాత్రమే పరిమితమైంది.

లక్షింపేట సంఘటన వెనువెంటనే బొజ్జా తారకంగారు కన్వీనర్గా ఏర్పడిన 'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి' – దళితులపై మారణకాండ సాగించిన దోషులను కఠినంగా శిక్షించాలని; మడ్డువలస రిజర్వాయర్ భూములపై దళితులకు హక్కు కల్పించాలనే ప్రధాన డిమాండ్స్‌తో నిరంతరాయ, ప్రచార ఆందోళనా కార్యక్రమాలు సాగిస్తూ వస్తోంది.

ఈ వత్తిడి ఫలితంగా, లక్షింపేట దళితుల హత్యకేసు విచారణకు లక్షింపేటలోనే ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అయితే దీని అమలు నత్తనడక నడుస్తోంది. కాగా, చాపకింద నీరులాగా అధికారం, కులం, డబ్బు, పలుకుబడులతో దోషులు కేసు నుండి తప్పుకునే పథకాలు, కేసు నీరుగార్చే చర్యలు సాగిస్తున్నారనేది వాస్తవం.

చుండూరు ఘటన తర్వాత కాలంలో సాపేక్షంగా దీర్ఘకాలంపాటు లక్షింపేట ఘటలో దోషులను శిక్షించాలని రాష్ట్రవ్యాపితంగా ఆందోళనలు ఒకవైపున సాగుతుండగానే చుండూరు కేసుపై హైకోర్టు తీర్పు వెలువడింది. దాదాపు 24 సం॥ల క్రితం జరిగిన చుండూరు దళితుల మారణకాండలో క్రిందికోర్టు విధించిన శిక్షలపై చేసుకున్న అప్పీలును విచారించిన ఇరువురు న్యాయమూర్తులతో కూడిన హైకోర్టు ధర్మాసనం 2014 ఏప్రియల్ 22న వెలువరించిన తీర్పు, తదనంతర కార్యక్రమాలు, చర్చలు అందరి దృష్టిలో వున్నవే. 'చుండూరు దళితుల న్యాయపోరాట కమిటి' ఏర్పడి న్యాయం కోసం తిరిగి రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చుండూరు దళితుల హత్యకేసులో రాష్ట్ర హైకోర్టు ధర్మాసనం – క్రిందికోర్టులో శిక్షలుపడ్డ వారందరినీ విడుదల చేస్తూ నిర్దోషులుగా తీర్పు చెప్పటం – ఈ వ్యవస్థ స్వభావాన్ని అంచనావేయలేని అనేకమందిని నిర్ఘాంతపరిచింది. న్యాయస్థానాలలో న్యాయపోరాటం ద్వారా దళితులపై మూకుమ్మడి హత్యాకాండ సాగించిన భూస్వామ్య, అగ్రకుల దురహంకారులకు కఠినశిక్షలు పడతాయని భావించిన వీరు హతాశులయ్యారు.

చుండూరు దళితుల హత్యకేసుపై హైకోర్టు ధర్మాసనం యొక్క తీర్పు అనంతరం దళిత ప్రజా సంఘాలు, ప్రజాస్వామికవాదులందరి నుండీ విడివిడిగా అయినా 'అందరూ నిర్దోషులైతే,.... చుండూరు దళితుల హంతకులెవరు?' అనే ప్రశ్న ముందుకొచ్చింది.

ఈ ప్రశ్నకు సమాధానంగా న్యాయసాంకేతిక అంశాలపై చర్చోపచర్చలు జరిగాయి; జరుగుతున్నాయి. ప్రాసిక్యూషన్ (పోలీసులు) సాక్ష్యాలను బలంగా నమోదు చేయలేకపోయిందనీ, సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్ సందర్భంగా సాక్ష్యాలన్నీ వీగిపోయాయనీ కనుక చుండూరు ప్రత్యేక న్యాయస్థానం విధించిన శిక్షలను రద్దుచేస్తూ జైలులోనున్న వారినందరినీ విడుదల చేస్తున్నామని హైకోర్టు ధర్మాసనం ప్రకటించింది. వారు ప్రభుత్వానికి చెల్లించిన జరిమానాలన్నింటినీ తిరిగి చెల్లించాలని కూడా ఆదేశిస్తూ, 'అన్యాయంగా' ఇంత కాలం జైలు శిక్షననుభవించినందుకుగానూ, వారిపట్ల సానుభూతిని వ్యక్తం చేసింది.

పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచిన నిందితులు దోషులు అవునా కాదా అని తమ ముందుకొచ్చిన సాక్ష్యాల ఆధారంగా తేల్చి చెప్పటం మాత్రమే న్యాయమూర్తుల బాధ్యత అనేది కొందరి వాదన. కోర్టు ముందుకొచ్చినవారు నిర్దోషులైతే, దోషులెవరనేది తేల్చవలసిందిగా పోలీసులను ఆదేశించే కర్తవ్యం న్యాయమూర్తులకు లేదని వారి అభిప్రాయం. కొందరు అమాయకంగానూ, మరికొందరు ఉద్దేశ్యపూర్వకంగానూ చర్చను ఇక్కడికే కుదించి, తీర్పునిచ్చిన న్యాయమూర్తి సామాజికవర్గం లేదా కులం మీదకు విషయాన్నంతా కేంద్రీకరిస్తున్నారు. అంటే, తీర్పునిచ్చిన న్యాయమూర్తి అగ్రకులానికి సంబంధించి – ముఖ్యంగా రెడ్డి కులానికి చెందినవాడు కాకుంటే, బాధిత దళితులకు అనుకూలంగా తీర్పు వచ్చి వుండేదనే భ్రమలలో దళితులను వుంచటమే కాదా ఇది?!

ఇక్కడే – ముక్కలు ముక్కలుగా విషయాలను విడగొట్టి సమాధానపరచుకోవటం కాకుండా, సమగ్రంగా విషయాలను పరిశీలిస్తే మనకు సత్యం బోధపడుతుంది. 1947 తర్వాత నుండీ, ముఖ్యంగా – ప్రపంచంలోనే 'ప్రసిద్ధమైన' భారత రాజ్యాంగం ఉనికిలోకి వచ్చిన 1950ల తర్వాత నుండీ పుంఖాను పుంఖంగా ప్రత్యేకించి గ్రామీణ భారతంలో దళితులపై, బలహీనులపై, భూస్వామ్య, అగ్రకుల దురహంకారుల దాడులు జరుగుతూ వస్తున్నాయనేది వాస్తవం కాదా? వీటిల్లో ఎన్ని కేసులు గ్రామాన్ని దాటి పోలీస్ స్టేషన్‌కు, పోలీస్‌స్టేషన్లను దాటి కోర్టు గుమ్మం వరకూ వచ్చాయి? ఇక, అలా వచ్చిన వాటిల్లో ఎన్ని కేసుల్లో దళిత హంతకులకు శిక్షలు పడ్డాయి? ఇతర రాష్ట్రాల్లో ఈ మధ్యకాలంలో ఉన్నత న్యాయస్థానాలు వెలువరించిన తీర్పులు కూడా ఆందోళనకరంగా వున్నాయి. 1997 డిసెంబర్‌లో బీహార్ రాష్ట్రం – లక్ష్మణ్‌పూర్‌బాతేలో అగ్రకుల భూస్వాముల రణబీర్‌సేన 27 మంది మహిళలు, 14మంది పిల్లలతోసహా 58 మంది దళితులను ఊచకోతకోసిన ఘటనలో జిల్లా కోర్టు విధించిన కొద్దిపాటి శిక్షలను కూడా రద్దుచేస్తూ పాట్నా హైకోర్టు 2013 అక్టోబరులో తీర్పునిచ్చింది. 1996 జూలైలో బీహార్ రాష్ట్రం బతానితొలాలో, 1998 మేలో నగడిలో, 2000 జూన్‌లో మియాంపూర్‌లో అగ్రకుల భూస్వాములు జరిపిన మారణకాండల కేసులలో ప్రధాన నేరస్థులందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ పాట్నా హైకోర్టు తీర్పులు ఇచ్చింది. 2007లో ఒడిషా రాష్ట్రం కంథమాల్‌లో హిందూ మతోన్మాదులు ఒక బాప్టిస్టు చర్చినీ, 14మంది క్రిస్టియన్ల ఇళ్ళనీ తగులబెట్టిన కేసులో 54 మంది ముద్దాయిలను నిర్దోషులుగా ప్రకటిస్తూ 2013 అక్టోబరులో ఒడిషా హైకోర్టు వారిని విడిచిపెట్టింది. కనుక, దళితులు, మత మైనారిటీలు, మహిళలు, బలహీనవర్గాలు – పీడితవర్గ ప్రజానీకానికి ఈ దోపిడీవ్యవస్థలో 'న్యాయస్థానాల ద్వారా న్యాయం అందటం ఎండమావే'నన్న వాస్తవాన్ని గడచిన ఆరున్నర దశాబ్దాల కాలంలో న్యాయస్థానాల పనితీరు స్పష్టం చేయటంలేదా?! ఈ వాస్తవాలన్నింటినీ సమగ్రంగా ముందు పెట్టుకోగలిగితే హృదయం బద్దలవుతుంది. ఈ వ్యవస్థ నగ్నస్వరూపం కళ్ళెదుట సాక్షాత్కరిస్తుంది. రాజ్యాంగం ప్రబోధించే ధర్మపన్నాలు, కఠినమైనవిగా చెప్పబడే – ప్రత్యేకించి దళితులపై అత్యాచారాల నిరోధానికే రూపొందించాయని చెప్పబడుతున్న అనేక చట్టాల డొల్లతనం వెల్లడవుతుంది.

అంటే దీనర్థం – దళితులపై అత్యాచార నిరోధక చట్టాలు అనవసరమనీ కాదు, న్యాయస్థానాలలో చట్టపరిధుల్లో హంతకులకు శిక్షలుపడేవిధంగా జరిపే న్యాయపోరాటం వృధా అనీ కాదు. కానీ అదే సమగ్రమైనదీ, అంతిమమైనదీ మాత్రం కాదు. ఈ అవగాహనను దళిత, ప్రజాసంఘాలు అందిపుచ్చు కున్నప్పుడు దళితులపై దాడులకు కారకులను శిక్షించాలని చట్టపరిధిలో పోరాడుతూనే, దళితులపై దాడులకు మూలాన్ని కీలకమైన క్షేత్రస్థాయితో శోధించి, ఛేదించటానికి మార్గం సుగమవుతుంది. అప్పుడే ఈ వ్యవస్థ స్వభావాన్ని అర్థం చేసుకునే వీలు కలుగుతుంది.

\ \ \

ఇటీవలి కాలంలో దళితులపై అత్యాచారాలు, దాడులకు సంబంధించిన మరికొన్ని ఘటనలను చూద్దాం. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం – అజంఘడ్ జిల్లా బదాయి గ్రామంలో 2014 మే 27న బహిర్భూమికి వెళ్ళిన ఇద్దరు దళిత బాలికలపై సామూహిక అత్యాచారం జరిపిన అగ్రకుల ఉన్మాదులు వారిని చెట్టుకు ఉరివేసి హత్యచేసిన సంఘటన మరో సంచలనం కలుగజేసింది. దీనిపై సిబిఐ దర్యాప్తులు, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు, ఇద్దరు కానిస్టేబుల్స్‌ను సస్పెండ్ చేయటం, జాతీయ మహిళా కమీషన్ సందర్శనలు, 'అత్యాచార సంక్షోభసెల్' ఏర్పాటు ప్రకనటలు, 'ప్రతిపక్షాల' ఆందోళనలు... అన్నీ యధాప్రకారం జరిగిపోతున్నాయి.

కాగా, 'సులభ్ ఇంటర్నేషనల్' సంస్థతో గొంతు కలిపిన ప్రభుత్వం కూడా గ్రామాలలో ఇండ్లలో సెప్టిక్ లెట్రిన్‌లు లేకపోవటమే ఈ అత్యాచారాలకు కారణంగా పేర్కొంటున్నది. కనుక, సులభ్ సంస్థ పూనుకొని ఆ గ్రామంలో లెట్రిన్లను నిర్మించేందుకు సిద్ధమైంది. హతులైన దళిత బాలికలుగానీ, అత్యాచారాల బారినపడుతున్న పేద, బలహీనవర్గాల మహిళలుగానీ బహిర్భూమికి మినహా బయటకు వెళ్ళకుండానే వారి రోజువారీ జీవనం గడుస్తోందా? పొలాల్లో, పని ప్రదేశాల్లో లెక్కకు మించిన అత్యాచారాలకు కారణమౌతున్న భూస్వామ్య, అగ్రకుల దురహంకారాన్ని, కలిగినోళ్ళ బిడ్డల కండకావరాన్ని ఎత్తిచూపి, దానికి వ్యతిరేకంగా బాధిత దళిత, పీడిత జన సమూహాన్నంతా ఒక్కటై ఉద్యమించనీకుండా ఎక్కడికక్కడ అప్రధాన అంశంపైకి కేంద్రీకరణను మరల్చటమనే ధోరణిని గుర్తించి ఎదుర్కోవలసి వుంది. గ్రామీణ ప్రాంత మహిళలకు ప్రధాన ఇబ్బందిగా వున్న బహిర్భూమి సమస్యను పరిష్కరించాల్సిందే. వ్యక్తిగత లేదా కనీసం సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి, సక్రమంగా నిర్వహించాల్సిందే. కానీ, ఆ సమస్య లేకుంటే ఈ అత్యాచారాలు జరిగి వుండేవి కావన్న స్థాయికి వానిని ఎత్తిపట్టటమే అభ్యంతరకరమైనది.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సంచలనం కలిగించిన ఈ అక్కా చెల్లెళ్ళ అత్యాచారం, హత్యల ఘటనపై ఆందోళనలు సాగుతుండగానే మే 29వ తేదీన అజాంఘడ్ జిల్లా – సరైమీర్ ప్రాంతంలో ఓ దళిత బాలికను నలుగురు వ్యక్తులు అపహరించుకువెళ్ళి దగ్గరలోని పొలాల్లో సామూహిక అత్యాచారం జరిపారు.

స్వయానా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ నియోజకవర్గ జిల్లా అయిన ఎటావీవాలో 2014 మే 11న ఆ ప్రాంతంలో ఆధిపత్యవర్గానికి చెందిన బసంత్‌లాల్ యాదవ్ కుమారుడు ఓ మహిళ ఇంట్లో ప్రవేశించి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై కేసు పెట్టారనే కోపంతో బసంత్‌లాల్ అత్యాచార బాధితురాలి తల్లిని తీవ్రంగా కొట్టి బహిరంగ వివస్త్రను చేశాడు.

బీహార్ రాష్ట్రంలో నవాడా జిల్లాలోని నవాజ్ ఘర్ గ్రామంలో 2014 మే 31న తమ పొలాల్లో, ఉచితంగా చాకిరీ చేయటానికి నిరాకరించిన నేరానికిగానూ, దళితులైన భార్యాభర్తలిరువురిని చితకబాదిన ఘటన వెలుగులోకి వచ్చింది.

మహారాష్ట్రలోని పూనేజిల్లా – బోడ్‌వాడ్ గ్రామంలో దళిత కులానికి చెందిన యువకులు కొందరు అగ్రకుల మహిళలను అవమానపరిచే విధంగా వ్యాఖ్యానించారనే నేరంమోపి ఆ గ్రామంలోని దళితులపై వందమందికిపైగా మరాఠా వర్గానికి చెందిన వారు దాడిచేసి తీవ్రంగా కొట్టారు. వారిలో ఆరుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. పోలీసులు రెండు పక్షాల వారిపై కేసులుమోపి చేతులు దులుపుకున్నారు. 2014 ఏప్రిల్‌లో అహమ్మద్‌నగర్‌లో ఓ అగ్రకుల యువతితో మాట్లాడిన నేరానికి ఓ దళితుడిని హత్యచేశారు.

ఒరిస్సా రాష్ట్రం మల్కాజిగిరి జిల్లా – గౌడగూడ గ్రామపంచాయితీ పరిధిలోని నీలిమరి గ్రామంలో లక్మా అంచానియా అనే ఓ మహిళ ఇతర కులానికి చెందిన అతనిని పెళ్ళి చేసుకున్నందుకుగానూ తీవ్ర చిత్రహింసలపాల్జేశారు. కుల బహిష్కరణ చేశారు. తిరిగి కులంలో చేర్చుకునేందుకుగానూ షరతు విధించి 2014 మే 22న ఆమెకు శిరోముండనం చేశారు.

మహారాష్ట్రలో గోండియా జిల్లా – కవలెవాడ గ్రామంలో – 48 ఏళ్ళ దళితుడు సంజయ్ ఖోబ్రగాడేను ఇటీవల జరిగిన ఎన్నికలలో తమకు అనుకూలంగా వ్యవహరించలేదనే అక్కసుతో, బిజెపి, సంఘ్ పరివార్ అనుకూలురు – ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే, 2014 మే 19న అతని ఇంటిపై దాడిచేసి పెట్రోలు పోసి నిప్పంటించారు.

బీహార్ రాష్ట్రం – పాట్నా జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కులవివక్ష తీవ్రంగా కొనసాగుతోంది. దీనితో దళిత విద్యార్థుల హాజరు శాతం క్రమంగా పడిపోతున్నదని 'సెంటర్ ఫర్ సోషల్ ఈక్విటీ అండ్ ఇన్‌క్లూజన్'అనే సంస్థ విడుదలన చేసిన నివేదికలో పేర్కొంది. ఈ పాఠశాలలో దళిత విద్యార్థులచే ఉపాధ్యాయుల మరుగుదొడ్లు శుభ్రం చేయించటం, కొందరు ఉపాధ్యాయుల వళ్ళు మర్దన చేయించుకోవడం వంటి పనులకు పాల్పడుతున్నారు.

తమిళనాడు రాష్ట్రంలో – ధర్మపురి ఘటనను గుర్తుచేస్తూ 2014 ఏప్రిల్ 26న చిదంబరానికి దగ్గరలోని వడక్కుమంగుడిలోని ఓ దళిత కాలనీపై ఆధిపత్య కులానికి చెందిన వన్నియార్లు ఘోరమైన దాడికి పాల్పడి 50 ఇళ్ళను దోచుకున్నారు – 15 ద్విచక్ర వాహనాలను, 4 మినీ వ్యాన్లను తగులబెట్టారు. వడక్కుమంగుడి గ్రామంలో అధిక సంఖ్యలోనున్న వన్నియార్లు – దళితులు ఉన్నత విద్యనభ్యసించటం, మోటారు వాహనాలను ఉపయోగించటం, మంచి దుస్తులు వేసుకోవటాన్ని సహించలేకపోవటంతోపాటు, వన్నియార్ల భూముల్లో గతంలోలాగా వెట్టిచాకిరీ చేయటానికి నిరాకరిస్తూండటం దీనికితోడు వన్నియార్ల కుల పార్టీ అయిన పిఎంకేకు ఓటువేయటానికి దళితులు నిరాకరించటంతో వారికి కంటగింపుగా మారి, ఈ దాడులకు తెగబడ్డారు.

బీహార్ రాష్ట్రం – పాట్నా జిల్లాలోని ఓ గ్రామంలో సరితాదేవి అనే ఓ రజక స్త్రీ ఆత్మగౌరవంతో జీవించటం సహించలేని గ్రామ పెత్తందార్లు, 'తలపొగరుగా' వ్యవహరిస్తుందంటూ 2014 ఫిబ్రవరి 16న ఆమె ఇంటిపై మూకుమ్మడిగా దాడిచేసి ఆమెను ఇంటి నుండి బయటకు ఈడ్చి కొట్టారు. ఆమె చేతులు కట్టివేసి, బట్టలు గుంజివేసి ఊరంతా తిప్పారు. – అడ్డువచ్చిన కూతురును, సరిత బంధువులను చావబాదారు. భర్త సమయానికి లేకపోవటంతో చావునుండి తప్పించుకొన్నాడు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టబోగా, పెద్దలతో పెట్టుకోవద్దంటూ పోలీసులు బెదిరించారు. గ్రామ సర్పంచ్ కలగ చేసుకోవటం, పత్రికలలో విషయం వెల్లడి కావడటంతో దాడికి పాల్పడిన కొందరిపై కేసు నమోదు చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం – జిల్లా కేంద్రమైన విజయనగరానికి 40 కి.మీ. దూరంలోనున్న మెంటాడ మండలం – జక్కువ గ్రామంలో 2014 మే 2వ తేదీన నూతనంగా నిర్మించిన ఓ దేవాలయంలో దేవుడి విగ్రహప్రతిష్టాపన కార్యక్రమానికి వెళ్ళిన ఓ దళిత మహిళ్పై స్థానిక అగ్రకుల అహంకారులు దాడిచేసి ఈడ్చి అవతలకు గెంటివేశారు.

\ \ \

కమ్యూనిస్టులు గతకాలం నుండీ భూమి సమస్యకు – అంటరానితనం, దళితులపై దాడులు, వివక్షకు గల సంబంధాన్ని వివరిస్తూనే పేద ప్రజానీకాన్ని – ముఖ్యంగా అట్టడుగు పీడిత, దళిత ప్రజానీకాన్ని సంఘటితం చేసి పోరాటాలు నిర్మించి వారి భూములను స్వాధీనం చేసుకోవటంతోపాటు మొత్తంమీద అగ్రకుల భూస్వామ్య, పెత్తందారుల అహంకారంపై పెద్దదెబ్బ కొట్టారు. తద్వారానే అనేక ప్రాంతాల్లో నిజమైన అర్థంలో దళితులు, పీడితులు ఈనాటికీ సగర్వంగా తలెత్తుకొని జీవించే స్థితిలో వున్నారు.

కారణాలేవైనా ఈ పోరాటాలు వెనుకపట్టు పట్టడం భూస్వామ్య, పెత్తందారీ వర్గాలకు – వీరిని సామాజిక దన్నుగా చేసుకొని గ్రామీణ ప్రాంతాల్లో తన దోపిడీని విశృంఖలంగా సాగిస్తోన్న సామ్రాజ్యవాదులకు, వారి ఏజెంట్లకు బహు సంతోషాన్ని కలుగజేస్తోందనేది వాస్తవం. సరిగ్గా సాపేక్షంగా ఈ సందులోకి– అనేక వలంటరీ సంస్థలు రంగప్రవేశం చేశాయి. వీటిల్లో అత్యధికం సామ్రాజ్యవాదుల పనుపున కమ్యూనిస్టు పార్టీలను, కమ్యూనిస్టు నాయకులను గంపగుత్తగా, ముఖ్యంగా–కమ్యూనిస్టు భావజాలాన్ని తూలనాడుతూ, కించపరుస్తూ, ఎగతాళిచేస్తూ బాహాటంగా మాట్లాడుతుండటం క్షంతవ్యం కాదు. ఇది – తాము ఎవరి ప్రయోజనాల కోసమైతే కంకణం కట్టు కున్నామంటున్నారో

(తరువాయి 2వ పేజీలో)

## తెలుగు ప్రజల...(మొదటిపేజీ తరువాయి)

తప్పనిసరై చర్చలోకి వచ్చినా తాము గీసిన గిరిలోనే చర్చసాగేలా చేశాయి.

ఉదాహరణకు రైతాంగ రుణసమస్య. రైతాంగానికి సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులూ, సాగునీరు, విద్యుత్తు, డీజిలు రేట్లను అనేకరెట్లు పెంచిన ఫలితంగా, ప్రభుత్వ కొనుగోలు సంస్థలను రంగం నుంచి తప్పించి ప్రైవేటు వ్యాపారులకు స్వేచ్ఛ నిచ్చిన ఫలితంగా కనీస మద్దతు ధర రాక రైతాంగం నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కౌలురైతుల స్థితి మరీ దుర్భరం. బ్యాంకు రుణాలు కూడా అందక మరింత క్రుంగి పోతున్నారు. రైతాంగం రుణభారం పెరగడానికి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు కారణం. అవి మార్చకుండా రైతాంగ సమస్య తీరదు. ఈ ఎన్నికల్లో ఈ విధానాల గురించి చర్చ జరగకుండా పాలకవర్గ పార్టీలు అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాయి. రైతాంగపు బ్యాంకు రుణాలను రద్దుచేస్తామని పాలకవర్గ పార్టీలన్నీ ఈ ఎన్నికల్లో వాగ్దానాలు చేసాయి. అప్పు తీర్చిన రైతులకు కూడా లబ్ధి చేకూరుస్తామంటూ పోటీపడి వాగ్దానాలు చేశాయి. ప్రభుత్వంలోకి రాగానే మొదటి సంతకం దానిమీదే నన్నాయి. ఈ ప్రచారపు హోరులో వీరు వినిపించకుండా చేసిన అంశం – తామనుసరిస్తున్న విధానాలు మారకుండా రైతాంగపు రుణ సమస్య తీరదన్నదే! ఈరోజు అప్పు రద్దుచేసినా, మళ్లీ అప్పులో కూరుకుపోతారన్న అంశాన్ని చర్చలోకి రాకుండా చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత కూడా ఓడిన పార్టీ తాను కూడా వాగ్దానం చేశానన్న అంశాన్ని అవసరార్ధం మింగి, అమలు అసాధ్యమైన వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టారని విమర్శలకు దిగగా, లోటు బడ్జెట్టుతో అమలు సాధ్యసాధ్యాలను పరిశీలించాలంటూ గెలిచిన పార్టీ సన్నాయి నొక్కులు నొక్కింది. ఇప్పుడు కూడా వాగ్దానం అమలుచేస్తారా లేదా అన్నదే ఉత్కంఠభరిత చర్చగా సాగిస్తున్నారు తప్ప, పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాల తీరు తెన్నులను చర్చలోకి రానివ్వటంలేదు.

ప్రసార, సమాచార సాధనాలపై గుత్తాధిపత్యం కలిగిన పాలకవర్గ పార్టీలు ఎన్నికల సమయంలో జరగవలసిన చర్చను ఇలా గిరిగీసి ప్రక్కకు మళ్ళించాయి. ఇదికాక సారా, డబ్బును వరదలా ప్రవహింపచేసి ప్రజలను మత్తులో ముంచివేశాయి.

ఈసారి ఈ పాలకవర్గపార్టీలన్నీ అభివృద్ధి మంత్రాన్ని జరిపించాయి. తెలంగాణా పునర్నిర్మాణమని టిఆర్ఎస్ అంటే నవనిర్మాణమంటూ కాంగ్రెసు నినాద మిచ్చింది. పునర్నిర్మాణమా, నవనిర్మాణమా అంటూ వాగాడంబర చర్చచేశాయి తప్ప తాము తీసుకోబోయే చర్యలేమిటో నిర్దుష్టంగా చెప్పకుండా తప్పుకున్నాయి. 10 జిల్లాలున్న తెలంగాణాను 23 జిల్లాలుగా చేస్తాం. హైదరాబాదను ఐటి కేంద్రంగా చేస్తాం (ఇప్పటికే కానట్లు) వ్యవసాయానికి ప్రథమ ప్రాధాన్యత (అంటే అర్ధమేమిటో చెప్పరు – ఇప్పటివరకూ వున్న విధానాలకు ప్రత్యామ్నాయం చెప్పరు) వంటి ఆడంబర ప్రకటనలతో టిఆర్ఎస్ సరిపుచ్చింది.

ఆంధ్ర ప్రాంతంలో అభివృద్ధి మంత్రజపం మరోస్థాయికి చేరింది. గుజరాత్ తరహా అభివృద్ధి తెచ్చే (అదేమిటో ఎవరూ చెప్పరు) మోడీ కేంద్రంలోనూ, అభివృద్ధి చేయగల సత్తా వున్న చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని సింగపూర్‌ను మించి అభివృద్ధి చేస్తామంటూ ఆర్భాటపు ప్రచారం సాగించారు. బిజెపి, టిడిపి, జగన్, కిరణ్‌లపార్టీలు తమ అభివృద్ధి ఏమిటో పత్రికా ప్రకటనల్లో తెలిపాయి. వీటన్నింటిలోనూ ఉన్న అభివృద్ధి అంశాలివి : రాయలసీమలో గనుల అభివృద్ధి (మళ్ళీ అర్ధం లేని పద ప్రయోగమే తప్ప ఇటు కడపలోగానీ, అటు బయ్యారంలోగానీ స్టీలు ఫ్యాక్టరీ పెడతామని వాగ్దానం చెయ్యలేదు)గాలిజనార్దన్ కాకపోతే మరొకడు ఖనిజాన్ని తరలించి అమ్ముకుంటాడు తప్ప ప్రజలకు ఒరిగేది లేదు. విశాఖ – కాకినాడ పెట్రోకారిడార్ నిర్మిస్తాం, వాన్‌పిక్ పేరు చెప్పకుండా ఒంగోలు నుండి చెన్నై వరకూ పారిశ్రామిక కారిడార్, ప్రతి జిల్లాకు ఒక రేవు, విద్యుత్తు కర్మాగారం నిర్మాణం – కోస్తా ప్రాంత అభివృద్ధికి వీరు చేసిన వాగ్దానాలివి. ఏ ప్రాజెక్టులు తమ జీవనాధారాలనూ, జీవనాన్ని ఛిద్రం చేస్తున్నాయని ప్రజలు నిరసన తెలిపి పోరాడుతూ వస్తున్నారో, ఆ ప్రాజెక్టులనే నిర్మిస్తామంటూ వీరు వాగ్దానాలు చేశారు. జిల్లాకొక రేవు నిర్మించి ఏమి ఎగుమతి చేస్తారు? ఏమి దిగుమతి చేసుకుంటారు? అన్న కనీస ప్రశ్న లేదు. ఇంతవరకూ సాగుతున్నట్లే దేశ అమూల్య ఖనిజ సంపదైన బాక్సైటు, ఇనుమును కారుచౌకగా ఎగుమతి చేయటాన్ని కొనసాగిస్తారు. విదేశాల నుండి బొగ్గు దిగుమతి చేసుకుని దానితో కరెంటు తయారీని కొనసాగిస్తారు. దీనికోసం రైతాంగాన్ని భూమి నుండి గెంటివేయటాన్ని కొనసాగిస్తారు. గనుల తవ్వకంతో గ్రామాలను నేలమట్టం చేస్తారు. తీరప్రాంతాన్ని బూడిదకుప్ప చేస్తారు. వీరి అభివృద్ధి మంత్రపు అసలు రూపం ఇది.

దేశ సంపదను విదేశీ, స్వదేశీ దోపిడీ వర్గాలకు దోచిపెట్టే ఈ ప్రజావ్యతిరేక ప్రాజెక్టుల నిర్మాణాలను సమర్ధవంతంగా అమలుచేయగలమంటూ ఈ పార్టీలు ముందుకొచ్చాయి. వీరిలో ఎవరు అధికారంలోకి రావాలో ఎంచుకోవాల్సింది దోపిడీ వర్గాలు. ప్రజలకు ఎంచుకోవటానికి ఏమీలేదు. వీరిలో ఎవరు అధికారం లోకి వచ్చినా ప్రజలకు దక్కేది జీవన విధ్వంసమే.

## ఎన్నికల తరువాత :

ఎన్నికలు ముగిసాయి. తెలంగాణాలో టి.ఆర్.ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి అధికారంలోకి వచ్చాయి. తెలంగాణాలో టిడిపి తన ఉనికి తెలుపుకుంది. కాగా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు సీటు లేకుండా పోయింది.

రెండు రాష్ట్రాలు జూన్ 2న ఉనికిలోకి వచ్చాయి. విభజన ప్రక్రియను కేంద్రం సాగిస్తున్నది. ఎన్నికల తదనంతరం జరుగుతున్న ఘటనలు ప్రాంతీయ వైమనస్యాలను పెంచి మౌలిక సమస్యల నుండి, వాటి సక్రమ పరిష్కారాల నుండి ప్రజల దృష్టిని మళ్ళించి విభజించి–పాలించే గత విధానాన్నే కొనసాగించటానికి రెండు రాష్ట్రాలలోని పాలకవర్గాలు పూనుకున్నాయని తెలుపుతున్నాయి. దీనికోసమే విభజన ప్రక్రియలోని ప్రతి అంశాన్ని వివాదాస్పదం చేస్తున్నాయి. ఆ వివాదాల మాటున అసలు సమస్యలను దాటవేస్తున్నాయి.

## ప్రభుత్వ ఉద్యోగాలు :

రెండు రాష్ట్రాలకూ ఉమ్మడి రాష్ట్ర ఉద్యోగుల కేటాయింపును ప్రతి దశలోనూ వివాదాస్పదం చేశారు. ఏ రాష్ట్రంలో పనిచేయాలో ఎంచుకొనే ఆప్షన్ హక్కు వుండాలంటూ ఒక ప్రక్క, స్థానికత ఆధారంగా కేటాయింపులుండాలంటూ మరో ప్రక్క ఉద్యోగ సంఘాల నాయకుల నుండీ రాజకీయ పార్టీల నాయకుల వరకూ ఆవేశపూరిత ఉపన్యాసాలతో వైమనస్యాలు రెచ్చగొట్టేందుకు పూనుకున్నారు.

ఉద్యోగుల కేటాయింపు రాష్ట్ర ఉద్యోగులలో కొందరికే వర్తిస్తుంది. జిల్లా కేడరు, జోనల్ కేడరు ఆయా జిల్లాలూ జోనులూ ఏ రాష్ట్రంలో వున్నాయో ఆ రాష్ట్రంలోనే వుంటారు. మిగిలేది రాష్ట్రస్థాయి కేడరు. వీరినే ఇరు రాష్ట్రాలకూ కేటాయించాలి. జనాభా నిష్పత్తిలో ఇరు రాష్ట్రాలకూ కేటాయించారు. ఇవి తాత్కాలికం. ఉద్యోగుల అభ్యర్ధనలు విన్న తర్వాత అంతిమ కేటాయింపు జరుగుతుంది. పరిపాలనా యూనిటుగా మాత్రమే ఉమ్మడి రాష్ట్రంలేదు. ఆర్ధికంగా, రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా కూడా ఒక యూనిటుగా వుంది. ప్రజల మధ్య అన్నిరకాల సంబంధాలు సాగుతున్నాయి; ఇక ముందూ సాగుతాయి. దీనికి సరిహద్దులు అడ్డురావు. దీనివల్ల ఉద్యోగుల కేటాయింపులో అనేక కోణాలు పరిశీలించి అంతిమ నిర్ణయం తీసుకోవాలి. రూళ్ళకర్ర వంటి ఒక నిబంధనతో సమస్య పరిష్కారం కాదు. ఇవన్నీ తెలిసి కూడా దీనిని భావోద్వేగ సమస్యగా మారుస్తున్నారు. రాజకీయ నాయకులు ఇరు ప్రక్కలా రెచ్చగొట్టుడు మాటలు వదులుతున్నారు. ఎందుకిలా జరుగుతోంది?

ఉద్యోగుల కేటాయింపు క్రమంలో కొన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. **ఒకటి :** ప్రభుత్వ ఉద్యోగాలలో 5 లక్షల 60 వేల ఖాళీలున్నాయి. జనాభా ప్రాతిపదికన వీటిని కేటాయిస్తే తెలంగాణాకు 2 లక్షల 60 వేలు, ఆంధ్రప్రదేశ్‌కు 2 లక్షల 90 వేలు ఉద్యోగాలు ఖాళీగా వుంటాయి. ఇన్నాళ్ళూ అధికారంలో వున్న కాంగ్రెసుపార్టీగానీ, ప్రతిపక్షంలో వున్న టిడిపి, టిఆర్ఎస్‌లుగానీ ఈ ఖాళీలను పూరించాలని చిత్తశుద్ధితో చేసిందేమీ లేదు. ప్రతి ముఖ్యమంత్రీ లక్ష ఉద్యోగాలు కల్పిస్తామంటూ ఆర్భాటపు ప్రకటనలు మాత్రమే చేశారు. ఆచరణలో కొన్ని వందల ఉద్యోగాల భర్తీకి మాత్రమే ప్రకటనలిచ్చారు. లక్షలాదిమంది వీటి పోటీ పరీక్షలు రాసేందుకు ట్యూషన్ సెంటర్లకు వేలాది రూపాయలు చెల్లించి తయారవటం ఒక దశ. ఏదో వంకతో పరీక్ష జరగదు. పరీక్ష జరిగితే ప్రశ్నాపత్రంలో తప్పులు. ఆ తర్వాత సెలక్షను. దానిలో అవకతవకలు. ఇవన్నీ కోర్టు గుమ్మం తొక్కడం. చివరకు సెలక్షను అయినా అప్పాయింట్‌మెంట్ ఆర్డరు రాదు. ఈలోపున ఒప్పంద ఉద్యోగులతో పనిచేయించటం గత పదేళ్ళుగా ఈ తంతు సాగుతున్నది. ఇదంతా పాలకులు ఉద్దేశ్యపూరితంగా ఆడుతున్న నాటకమన్నది స్పష్టం. ఎన్ని వాగ్దానాలు వర్షాలుగా కురిపించారో! అయితే ఈ ఖాళీలను భర్తీ చేస్తామన్న వాగ్దానాన్ని మాత్రం ఏ పార్టీ చెయ్యలేదు. ఉన్న ఉద్యోగులలో ప్రాంతీయంగా న్యాయం జరిగిందా లేదా అన్న సమస్యను పాలకులు ఈనాటికీ తేల్చి చెప్పరు. ఎవరికి తోచిన లెక్కలు వారు చెప్పుకునే స్థితి వుంచారు. ఎన్నో కమిటీలు, ఎన్నో నివేదికల తర్వాత వున్న ఈ స్థితి పాలకులు దురుద్దేశపూరితంగా నెలకొల్పిందే. ఇప్పటికైనా అధికారం చేపట్టిన టిఆర్ఎస్ గానీ, టిడిపి గానీ ఈ ఖాళీలు భర్తీ చేస్తామన్న వూసు కూడా ఎత్తుకోరు. పైగా ఆంధ్రావాళ్ళని ఇక్కడ పని చెయ్యనివ్వబోమని కెసిఆర్; మా వాళ్ళకు అన్యాయం జరగనివ్వబోమంటూ చంద్రబాబు వీరంగాలు వేసి ప్రాంతీయ వైషమ్యాలను పెంచుతున్నారు తప్ప పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు కూడా పి.జి.లు, బిటెక్‌లు పోటీపడే దుస్థితిని తక్షణమే కొంతయినా తగ్గించేందుకు ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీచేసే కార్యక్రమాన్ని చేపట్టరు. కాకపోగా మా అభివృద్ధి యువతకు ఉపాధి సౌకర్యాలు కల్పిస్తుందంటూ రోట్లో బూరెలు వండి వడ్డిస్తున్నారు.

**రెండు :** ఇవి లెక్కలలో కన్పించే ఖాళీలు. ఉద్యోగుల కేటాయింపు కమిటీకి అసలెంత మంది ఉద్యోగులున్నారో తెలియక తలపట్టుకుంది. ప్రభుత్వం ఆమోదించిన ఉద్యోగాల సంఖ్య ఒకటైతే, అసలక్కడ ఉద్యోగాలు చేస్తున్నవారి సంఖ్య అంతకన్నా తక్కువగా వుంది. చివరకు జీతాలివ్వనంటూ బెదిరిస్తే తప్ప ఉద్యోగుల అసలు సంఖ్య తేలలేదు. ఒక ప్రక్క ఇక్కడ ఉద్యోగులను నియమించాలని నిర్ణయించింది; మరో ప్రక్కన వాటిని నియామకాలు జరపకుండా ఆపింది. ఒక్క సెక్రటేరియట్ పరిధిలోనే 3 వేలకు పైగా నియామకాలు జరగలేదంటే రాష్ట్రవ్యాపితంగా ఎన్ని వున్నాయో ఊహకు అందదు.

ఈ వాస్తవాలను దాచిపెట్టడానికే, తద్వారా యువత ఈ ఖాళీలను భర్తీ చేయమని అడగకుండా చేయటానికే అందరూ కలసికట్టుగా ఉద్యోగుల కేటాయింపును ప్రాంతీయతల భావోద్వేగ సమస్యగా మారుస్తున్నారు. రెచ్చగొట్టుడు మాటలన్నీ ప్రక్కనపెడితే చివరకు తేలిందేమిటి? 200 మంది ఆంధ్రా ఉద్యోగులు తప్పుడు సర్టిఫికేట్లతో తెలంగాణాలోనే ఉండిపోతున్నారట. ఇది నిజమని ఒప్పుకున్నా, వీరందరినీ ఆంధ్రాకే కేటాయించినా, ప్రభుత్వం అంగీకరించిన లక్షల ఖాళీలలో, కనీసం ఆమోదించి నింపకుండా వున్న వేలాది ఉద్యోగాలలో ఇదెన్నోవంతు? ఈ చిన్నపాటి సమస్యను భావోద్వేగ సమస్యగా మారుస్తున్నారంటేనే పాలకపార్టీల దురుద్దేశ్యాలు అర్ధం కావటంలేదా? ప్రాంతీయ వైషమ్యాలు కొత్తగా ఏర్పడిన రెండు రాష్ట్రాల మధ్య కొనసాగించాలని చూడటం కాదా?

## జలవనరుల పంపకం :

కృష్ణా, గోదావరి నదీజలాలు–పరీవాహక ప్రాంత రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ల మధ్య అంతర్రాష్ట్ర వివాదంగా వుంది. దీని పరిష్కారం కోసం కృష్ణా జలాల పంపిణీకి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఏర్పాటు అయింది. అది తన తీర్పును ఇచ్చింది. నికర జలాలనూ, మిగులు జలాలనూ నిర్ణయించి, రాష్ట్రాల మధ్య వాటిని పంపకం చేయటంతోపాటుగా, అన్ని అనుమతులున్న ప్రాజెక్టులకు కూడా నికర జలాల కేటాయింపులు చేసింది. అన్నిరకాల అనుమతులు ఇంకా పొందని ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయలేదు. ఇదికాక తన తీర్పు సక్రమంగా అమలుజరిపేందుకు మూడు రాష్ట్రాలతో ఒక ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలని సూచించింది. ట్రిబ్యునల్ తీర్పు స్థూలంగా బాగానే వుంది. ఈ ట్రిబ్యునల్ తీర్పు అంతిమం. దీనినే అమలుజరపాలి.

తెలంగాణా రాష్ట్ర ఏర్పాటును అంగీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం పునర్విభజన బిల్లును తెచ్చింది. దీనిలో కృష్ణా, గోదావరి నదీ జలాల పంపకానికి పద్ధతులు సూచించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన గోదావరి, కృష్ణా నదుల జలాలనూ రెండు రాష్ట్రాల మధ్య తిరిగి పంపకం చేసే పనిని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు అప్పగించింది.

ఈ విషయంలో ట్రిబ్యునల్ చేయగలిగింది తక్కువే. కృష్ణా జలాలను ఇప్పటికే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించటమేకాక కృష్ణా బ్యారేజీ, కేసి కెనాలు, శ్రీశైలం, జూరాల ప్రాజెక్టులకు నీటి కేటాయింపు చేశారు. ఈ కేటాయింపులు యధాతథంగానే అవి ఏ రాష్ట్రానికి చెందుతాయో వాటికే కేటాయించబడతాయి. అన్నిరకాల అనుమతులూ లేవు గనుక తెలుగు గంగ నుండి కృష్ణపై చేపట్టిన ఏ ప్రాజెక్టుకూ ఆయన కేటాయింపులు చెయ్యలేదు. అనుమతులువస్తే తప్ప ఇప్పుడు వాటికి కేటాయింపులు చెయ్యరన్నది స్పష్టమే. ఇక మిగిలింది ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన నీటిలో ప్రాజెక్టులకు కేటాయించిన నికర జలాలుపోనూ మిగిలిన నికర, మిగులు జలాలను స్థూలంగా తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య పంపకం చేయటమే. జనాభా లేదా సాగుభూమి ప్రాతిపదికన లేదా మరోవిధంగానో వీటిని విభజించవచ్చు. రెండు రాష్ట్రాల మధ్య ఎవరి వాదనలు వారు వినిపించినా, కేటాయింపులు చేయటం సులభమే. ఇక గోదావరి జలాల పంపిణీ, ఉమ్మడి రాష్ట్రానికి వున్న కేటాయింపునే పంచాలి. ఇక్కడ కూడా శ్రీరామపాద సాగర్‌కు కేటాయింపు నిర్దిష్టంగా ఇప్పటికే వుంది. ప్రతిపాదనలో లేదా నిర్మాణంలో వున్న ప్రాజెక్టులు వేటికీ అన్నిరకాల అనుమతులూ లేవు. పోలవరం, ప్రాణహిత – చేవెళ్ళ ప్రాజెక్టులకు అనుమతుల మంజూరును త్వరితం చేస్తానన్న హామీని మాత్రమే కేంద్రం యిచ్చింది. కనుక వీటికి నిర్దిష్టంగా కేటాయింపులేమీ వుండవు. కనుక కృష్ణా జలాలలాగే ఏదో ఒక ప్రాతిపదికన ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన గోదావరి నీటిని రెండు కొత్త రాష్ట్రాల మధ్య స్థూలంగా పంపకం చేయాల్సి వుంటుంది. తమ రాష్ట్రానికి రావాల్సిన వాటా గురించి ట్రిబ్యునల్ ముందు ఇరు రాష్ట్రాలూ ఎన్ని వాదనలైనా చేసుకోవచ్చు. కానీ గత అనుభవాలను గమనంలో వుంచుకొన్నప్పుడు దీనిని రాష్ట్రాల మధ్య వివాదంగా, రాష్ట్రాల ప్రజల మధ్య వైమనస్యంగా పాలకులు రెచ్చగొడుతున్నారనేది నిస్సందేహం. నీటిని నిప్పులా మండించేందుకు దోపిడీ పాలకవర్గాలూ, వారి రాజకీయపార్టీలూ ఎప్పుడూ సిద్ధంగానే వుంటాయి.

నదీజలాల పంపిణీకి సంబంధించి మరొక ముఖ్యాంశం వుంది. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సక్రమంగా అమలు జరిపేందుకూ, అందులో తలయెత్తే సమస్యలను పరిష్కరించేందుకూ మూడు రాష్ట్రాల మంత్రులూ, అధికారులతో కూడిన ఒక ప్రాధికార సంస్థను నెలకొల్పామని ట్రిబ్యునల్ సూచించింది. ఆ తర్వాత ఒక రాష్ట్రం రెండుగా విభజన జరిగినందున నాలుగు రాష్ట్రాలకూ కలిపి ఒక ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాల్సి వుంటుంది. ట్రిబ్యునల్ తీర్పు సారాంశమిదే. జల పంపిణీ సమస్య వచ్చేది అనావృష్టి సమయంలోనే. పరీవాహక రాష్ట్రాలన్నింటిలోనూ అనావృష్టి వుంటుంది. తక్కువ వున్న నీటిని హేతుబద్ధంగా చర్చించుకొని పరీవాహక రాష్ట్రాలు పంచుకునేందుకు ఈ ప్రాధికార సంస్థ ఏర్పాటు తోడ్పడుతుంది. తమిళనాడు కర్ణాటకల మధ్య కావేరీ నదీ జలాల వివాదం ఆరని కాష్టంలా సాగుతున్నది. సుప్రీంకోర్టు పూనుకొని పరిష్కారం చూపినా తలలు పగలటం ఆగలేదు. కొత్త ప్రధాని మోడీని కలిసిన ముఖ్యమంత్రి జయలలిత కావేరీ నదీజలాల పంపిణీకి కూడా ఉమ్మడి బోర్డును ఏర్పాటు చెయ్యమని కోరింది. నదీజలాలను ఇరువైపులా ప్రజల మధ్య వైషమ్యాలుగా రెచ్చగొట్టుకున్నవారే బోర్డును కోరవలసి వచ్చిందంటే తాము సృష్టించిన వైషమ్యాలు తమకే ఎంతటి సమస్యగా మారాయో, పులిమీద సవారీ ఎంత ప్రమాదకరమో తెలుపుతుంది. కనుక నాలుగు రాష్ట్రాలకూ కలిపి గోదావరి, కృష్ణా నదులకు ప్రాధికార సంస్థలను ఏర్పాటు చెయ్యటం దీర్ఘకాల ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మంచిది.

కానీ కేంద్ర ప్రభుత్వం దీనికి భిన్నమైన వైఖరి తీసుకుంది. కర్ణాటక, మహారాష్ట్రలను మినహాయించి, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లకు; కృష్ణా, గోదావరి నదులకు విడివిడిగా నీటిబోర్డులు ఏర్పాటుచేయాలని ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొంది. ఇదికాక ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులూ, కేంద్ర సాగునీటి

మంత్రితో ఒక సమితిని ఏర్పాటుచేస్తారు. నీటిపంపిణీలో వివాదాలు వస్తే ఈ సమితి పరిష్కరించాలి. సాధ్యం కాకపోతే ట్రిబ్యునల్‌కు వెళ్లాలి. అసలు మోసమంతా నీటిబోర్డులు ఏర్పాటులో జరిగింది. ట్రిబ్యునల్ సూచన ప్రకారం కేటాయింపులను సక్రమంగా పంపిణీ చేయటం బోర్డుల పని. మహారాష్ట్ర, కర్ణాటకలను మినహాయించి రెండు కొత్త రాష్ట్రాలకే దీనిని పరిమితం చేయటం నిరంతర వివాదాలకు తావిస్తుంది. ఇదికాక ఇప్పుడు నిర్మాణంలో వున్న ప్రాజెక్టులను పర్యవేక్షించటమూ, కొత్త ప్రాజెక్టులకు అనుమతినివ్వటమూ అన్న అధికారాలను కూడా బోర్డులకే కట్టబెట్టారు. ఈ బోర్డులు కేంద్రం క్రిందనే పనిచేస్తాయి. వీటి సిబ్బందిని కూడా కేంద్రమే నియమిస్తుంది. ఖర్చు మాత్రం రాష్ట్రాలకు కేంద్రమిచ్చే నిధుల నుండి దిగకోసుకుంటారు. బోర్డు తరపున అధికారాలన్నీ అధ్యక్షుడే చెలాయిస్తాడు. బోర్డులోని రాష్ట్రాల ప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం రాకపోతే అంతిమ నిర్ణయం కేంద్రానిదే.

ఈ బోర్డుల ఏర్పాటుతో జలవనరులపై రాష్ట్రాలకు ఎలాంటి అధికారమూ లేకుండా పోతుంది. నిర్మాణం పూర్తయి నీరందిస్తున్న ప్రాజెక్టుల అజమాయిషీ అంతా బోర్డులకే పోతుంది. నిర్మాణంలో వున్న ప్రాజెక్టుల పర్యవేక్షణ కూడా బోర్డులకే దక్కుతుంది. కొత్త ప్రాజెక్టు కట్టుకోవాలంటే ఇప్పటికి కావలసిన సవాలక్ష అనుమతులు వచ్చినా, ఈ బోర్డు అనుమతిస్తే తప్ప నిర్మించటం సాధ్యంకాదు. ఈ బోర్డుల ద్వారా జలవనరులపై అధికారాలన్నీ కేంద్రం లాక్కుంది. పరీవాహక ప్రాంతమంతా తెలంగాణాలోనే ఉన్న కిన్నెరసాని వంటి ఉపనదిపై ఒక చిన్న ప్రాజెక్టును కూడా ఈ బోర్డు అనుమతిస్తే తప్ప తన నిధులతో తెలంగాణా ప్రభుత్వం నిర్మించుకోలేదు.

తెలుగు గంగ నుండి నిర్మాణం చేపట్టిన ఏ ప్రాజెక్టుకూ ఈనాటివరకూ అనుమతులు యివ్వలేదు. కొన్ని యివ్వటం, కొన్ని ఆపి వుంచటం అన్న విధానాన్నే కేంద్రం అనుసరిస్తున్నది. దీని వల్ల కాలం దాటిపోతూ ఖర్చులు తడిసిమోపెడై ప్రాజెక్టులు పూర్తికాని స్థితి ఏర్పడుతున్నది. విశాల ప్రాంతాలను కరువుపీడిత ప్రాంతాలుగా వుంచి బడాబూర్జువాలకు కారుచౌకగా శ్రమశక్తిని సరఫరా చేసేందుకు ఈ విధానాన్ని కేంద్రం అనుసరిస్తుండగా, సాగునీటి సౌకర్యం కల్పించమని ప్రజలనుండి వస్తున్న డిమాండుకు తలఒగ్గినట్లు నటిస్తూ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్నారు. నిర్మాణం చేపట్టినా తమ ఆశ్రితగుత్తేదారులకు ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టుకునే సాధనంగా వాడుకుంటున్నారు.

ఈ కారణాలరీత్యానే తమ అధికారాలను కేంద్రం లాగివేసుకుంటున్నా కిమ్మనకుండా వూరుకుంటున్నారు. బోర్డుల ఏర్పాటులో జరుగుతున్న అధికార కేంద్రీకరణను అసలు లేనట్లు మిన్నకుంటున్నారు. బోర్డు సభ్యులుగా ఒక ప్రతినిధే సభ్యుడిగా చాలదు; ఇద్దరు కావాలని కోరటం దానిని కేంద్రం ఆమోదించటం; రెండు రాష్ట్రాలకు చెందిన వారుంటే వివాదం తెగదు గనుక బయటి రాష్ట్రాల వారిని నియమించాలంటూ విపరీత వాదన - యివన్నీ జలవనరులను వినియోగించుకునే స్వేచ్ఛ, రాష్ట్ర ప్రజలకు లేకుండా చేస్తున్న వాస్తవాన్ని దాచిపెట్టడానికీ, అర్థం పర్థంలేని వివాదాలతో వైషమ్యాలు రేపెట్టడానికి చేస్తున్నవే. పాలకవర్గ ముఠాలన్నీ కలసికట్టుగా ఆడుతున్న నాటకమిది. ఈ నేపథ్యంలో వ్యవసాయానికి ప్రథమ ప్రాధాన్యతనిచ్చి కోటి ఎకరాలకు నీటి సౌకర్యం కల్పిస్తామన్న కెసిఆర్ ప్రకటన ఆశల పందిళ్ళు వేయటమే తప్ప ఆచరణలోకి రాదన్నది స్పష్టం.

కొత్త రాష్ట్రాలు రెండింటికి అప్పులిచ్చేందుకు సిద్ధంగా వున్నామంటూ ప్రపంచబ్యాంకు ప్రకటించింది. సాగునీటి రంగానికి (డెల్టా ఆధునికీకరణ, చెరువుల పునరుద్ధరణ మొదలగునవి) ఉమ్మడి రాష్ట్రానికిచ్చిన రుణాలను రెండు రాష్ట్రాలతో తిరిగి రాయించుకోటానికే ప్రపంచబ్యాంకు తన బృందాన్ని పంపింది. ఈరకంగా ఇప్పటికి విడుదల చేయగా మిగిలిన నిధులను యివ్వటానికి నీటి తీరువారేటు పెంపకం, నీటి వినియోగదారుల సంఘాల ఏర్పాటు, వాటికి అధికారాల బదలాయింపు వంటి షరతులు అమలు జరిగితేనే నిధుల విడుదల జరుగుతుందని కూడా ప్రపంచబ్యాంకు స్పష్టం చేసింది. కనుక రైతాంగంపై నీటితీరువా భారాన్ని పెంచుతారు. దేశదేశాలూ తిరిగి పెట్టుబడులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానంటున్న చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలకిచ్చే అభివృద్ధి - ఈ రుణాలు, వాటి వడ్డీ భారాన్ని ప్రజల నుండి గోళ్లూడగొట్టి వసూలు చేయటమే!

## పోలవరం ముంపు బాధితులు

రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా చేపట్టిన జలయజ్ఞంలో ముఖ్యమైన ప్రాజెక్టు పోలవరం. 'కొన్ని లక్షల ఎకరాలకు నీటి పారుదలా సౌకర్యం, కృష్ణకు గోదావరి జలాల తరలింపు, ఆవిధంగా కృష్ణాడెల్టా స్థిరీకరణ, కృష్ణలో మిగులు నీరు రాయలసీమకు కేటాయింపు, విద్యుదుత్పత్తి, జలరవాణా' లక్ష్యాలుగా గొప్ప ప్రాజెక్టుగా దీనిని చిత్రించారు. అయితే ప్రాజెక్టు వివరాలలోకి వెళ్లి పరిశీలించినప్పుడు ఒక్క ఎకరానికి కూడా కొత్తగా దీనివల్ల నీటి పారుదలా సౌకర్యం ఏర్పడదు. ఎంత అనావృష్టి ఏర్పడినా కృష్ణా, గోదావరి డెల్టాలకు నీటి కొరత ఏర్పడటం అరుదు. ఇటీవల గోదావరి, కృష్ణా డెల్టాలకు ఏర్పడిన నీటిఎద్దడి ప్రకృతివల్ల ఏర్పడిందికాదు. రైతాంగంతో బలవంతాన పంటమార్పిడి చేయించేందుకు ప్రభుత్వ విధానపర చర్యలతో నీటిఎద్దడి ఏర్పడిందని వివరాలు పరిశీలిస్తే అర్థమౌతుంది. కృష్ణా, గోదావరి ఆయకట్టు స్థిరీకరణ అన్న పోలవరం ప్రాజెక్టు లక్ష్యం, ప్రాజెక్టు నిర్మాణానికి రైతాంగం యొక్క ఆమోదం పొందేందుకు చేర్చిందేతప్ప, నిజమైన లక్ష్యం కాదు. ఇక మిగిలింది జలరవాణా, విద్యుదుత్పత్తి, కాలువలద్వారా పెట్రోకారిడార్‌లో ఏర్పాటు చేయ తలపెట్టిన పరిశ్రమలకు నీటిసరఫరా. ఇవే అసలు లక్ష్యాలు. కాగా ఈ కొద్ది లక్ష్యాల కోసం మూడు జిల్లాల్లోని తొమ్మిది మండలాల్లో లక్షలాది గిరిజనులను నిర్వాసితులను చేస్తున్నారు. లక్షలాది ఎకరాల భూమిని ముంచి వేస్తున్నారు. ప్రాజెక్టుకున్న పరిమిత అసలు లక్ష్యాలకొరకు ఇంత వినాశనం అవసరంలేదనీ, ప్రాజెక్టు నిర్మాణం చేపట్టరాదనీ "జనశక్తి" మొదటినుండి వాదించింది. ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గిరిజనులు నిరసన తెలిపారు. ఇతరులు తెలుపుతున్న నిరసనలో పాల్గొన్నారు.

అయినా ప్రభుత్వం నిర్మాణానికి పూనుకుంది. కేంద్రం నుండి ఎలాంటి అనుమతులు రాకుండానే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించింది. నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూనే, నిర్వాసితులవుతున్న గిరిజనులకు అడవికి అడవి, భూమికి భూమి యిస్తూ పునరావాస కల్పన పూర్తయ్యేవరకూ నిర్మాణం ప్రారంభించరాదని మునక ప్రాంత ప్రజానీకం ఆందోళనా పోరాటాలు సాగించారు. ప్రభుత్వ నష్టపరిహారాన్ని తిరస్కరించి, మాకు పునరావాసం కల్పించే భూమి, అడవి చూపండంటూ గోదావరి జిల్లాల్లోని గోదావరి ఒడ్డు గ్రామాల ప్రజలందరూ ఒక్కమాటపై నిలిచారు.

గోదావరి నీరు తెలంగాణాకు అందకుండా ఆంధ్రకు మళ్లించే పోలవరం కట్టరాదంటూ తెలంగాణాలోని పాలకవర్గాలూ, పోలవరం కట్టకపోతే గోదావరి జిల్లాలు ఎడారిగా మారిపోతాయంటూ ఆంధ్రలోని పాలకవర్గ ముఠాలూ పోలవరం ప్రాజెక్టును ప్రాంతాల మధ్య సమస్యగా మార్చి భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి పూనుకున్నాయి. ఇరువైపులా పాలకవర్గ ముఠాలకు ప్రాజెక్టు మంచిచెడ్డలు పట్టలేదు; జలసమాధి అవుతున్న గిరిజనుల కష్టాలు పట్టలేదు. తమ సంకుచిత ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా ప్రాంతీయ వైషమ్యాలను పెంచాయి.

రాష్ట్ర విభజన జరగటంలో భాగంగా కాంగ్రెసు ప్రభుత్వం దీనిని కేంద్రప్రాజెక్టుగా ప్రకటించింది. విభజన చట్టంలో చేర్చింది. తెలంగాణాకు చెందిన ముంపుకు గురౌతున్న కొన్ని గ్రామాలనే ఆంధ్రప్రదేశ్‌లో కలిపింది. దీనితో ముంపుకు గురౌతున్న మండలాలన్నీ మొత్తంగా ఆంధ్రలో కలిపితే పునరావాసంలో సమస్యలు రావని ఆంధ్రప్రదేశ్ పాలకవర్గ ముఠాలు యాగీచేయగా ఇప్పుడు ఆర్డినెన్సుద్వారా వాటిని ఆంధ్రలో కలిపింది. తెలంగాణా గ్రామాలను ఆంధ్రలో కలపరాదంటూ తెలంగాణాలోని పాలకవర్గ ముఠాలు ఆందోళన చేస్తున్నాయి. దీనిని రెండు రాష్ట్రాల మధ్యా ఆరని వివాదంగా మార్చేందుకు తగిన విధంగా రూపుదిద్దిన సమస్యగా ఇరుపక్షాలు రంగం సిద్ధంచేసి వుంచాయి.

మునిగిపోతున్న భూమి ఏ రాష్ట్రంలో వుంటే ఏమిటి? దానివల్ల వచ్చే ఆదాయమూ లేదు. దానికోసం చేయాల్సిన పరిపాలనా ఏర్పాట్లు లేవు. అయినా మునిగిపోతున్న భూమినే వివాదం చేస్తున్నారు తప్ప జలసమాధి అవుతున్న గిరిజన జీవితాలు ఈ పాలకవర్గ ముఠాలకు పట్టలేదు.

ఇప్పుడు కీలక సమస్య మూడు జిల్లాలలోని తొమ్మిది మండలాల్లోని లక్షలాది గిరిజనుల పునరావాసం. అడవికి అడవి, భూమికి భూమితో జీవనాన్ని పునర్నిర్మించుకునే పునరావాసాన్ని ఎక్కడ కల్పిస్తున్నారు? ఏ విధంగా కల్పిస్తున్నారు? ఈ ప్రశ్నలకు మాత్రం ఇరువైపులా పాలకవర్గ ముఠాలు సమాధానం చెప్పటంలేదు. వారి దృష్టి అంతా పునరావాసానికి కేంద్రం యిచ్చే నిధులు ఎవరి ఆధ్వర్యంలో పంపకం జరగాలా అన్న దానిపైనే తప్ప, నిర్వాసిత గిరిజనులకు పునరావాసం కల్పించేందుకు ఏ ప్రాంతంలో సాధ్యమౌతుంది అన్న పరిశీలనకు కూడా పూనుకోవటంలేదు. ఆంధ్రలో కలపాలంటున్న వారు గిరిజనులకు ఆంధ్రరాష్ట్రంలోనే పునరావాసం కల్పించాలి; ఫలానా చోట పునరావాసం కల్పిస్తామని వారు చెప్పరు. అలాగే తెలంగాణాలోనే వుంచాలనే వారు కూడా గిరిజనుల పునరావాసం గురించి మాట్లాడరు. డ్యాము ఎత్తుతగ్గిస్తే నష్టం తగ్గుతుందిగదా అంటూ ఎత్తు తగ్గించి నిర్మాణం చేయమంటారు. ఎత్తుతగ్గిస్తే ప్రాజెక్టు అసలు లక్ష్యాలు నెరవేరవుగనుక కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ పాలకవర్గాలు అంగీకరించవని ఇప్పటికే తేలిపోయింది. పాలకవర్గ ముఠాలు తమ వాద ప్రతివాదాలతో మూలమైన గిరిజనుల పునరావాసాన్ని కప్పిపెడుతున్నాయి. తమ సంకుచిత ముఠా ప్రయోజనాలు నెరవేర్చుకునేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. దీనికోసం పోలవరం నిర్మాణాన్ని ఇరురాష్ట్రాలమధ్య ఆరని వివాదాన్ని చేయటానికే వారు పూనుకుంటారు. నవీన్ పట్నాయక్ ప్రధాని మోడీని కలిసి పోలవరం నిర్మాణాన్ని ఆపాలని కోరటం, దీనినొక అంతర్రాష్ట్ర వివాదంగా మార్చటంలో భాగమే. ఇక ఛత్తీస్‌ఘడ్ కూడా కలిస్తే నాలుగు రాష్ట్రాలమధ్య వివాదంగా పాలకవర్గాలు మలుస్తాయి. గిరిజనుల పునరావాస సమస్యను డబ్బులు విదిలించి, మాయంచేసే స్థాయికి దిగజార్చి తమ సంకుచిత ప్రయోజనాలు నెరవేర్చుకుంటాయి.

ఎన్నికల తదనంతరం కొత్తగా ఏర్పడిన రెండు రాష్ట్రాలలోని రాజకీయ పరిస్థితిలోని కొన్ని ముఖ్యాంశాలను ఇక్కడ పరిశీలించాము. సామ్రాజ్య వాదులకూ, బడాబూర్జువాలకూ, బడాభూస్వాములకూ అనుకూలంగా అమలుజరుపుతున్న విధానాలనే ప్రజల జీవితాలను సుఖమయంచేసే అభివృద్ధిగా చిత్రిస్తూ, ప్రజలు తమ జీవన, పనిపరిస్థితుల మెరుగుదలకు సంఘటితపడకుండా ప్రాంతీయ వైషమ్యాలను రెచ్చగొట్టడం ఈ రాజకీయ పరిస్థితిలోని ప్రధాన అంశం.

తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లలో ఏర్పడిన, ఈ రాజకీయ పరిస్థితి దేశ రాజకీయ పరిస్థితిలో భాగమే. కనీస నష్టపరిహారం కూడా చెల్లించకుండా రైతాంగం నుండి భూములు గుంజుకుని బహుళజాతి కంపెనీలకూ బడాబూర్జులవాలకూ కట్టబెట్టిన నరేంద్రమోడీ, దీనినే గుజరాత్ నమూనా అభివృద్ధిగా ప్రచారంచేసి అధికారంలోకి వచ్చాడు. ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మొదటి కాబినేట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఆంక్షలను సడలింపు, రక్షణరంగ పరిశ్రమల్లో విదేశీ కంపెనీలు 100శాతం పెట్టుబడికి పరోక్ష ఆమోదం; గత ప్రభుత్వం ఆమోదించిన దానినే కొనసాగిస్తూ చిల్లర వర్తకంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అంగీకరించ బోనంటూ గంభీర ప్రకటన; విదేశీ బ్యాంకుల్లోని అక్రమార్జనలను నల్లధనంగా విస్తరించి 'సిట్' ఏర్పాటు - చివరి రెండు ప్రజలను మభ్యపెట్టేవే) గమనిస్తే మోడీ ప్రభుత్వ విధానాలు యుపిఏ అడుగుజాడల్లో నడిచేవేనని అర్థమౌతుంది. వీటిని కప్పిపుచ్చి, ప్రజలదృష్టి మౌలిక సమస్యలనుండి మళ్లించేందుకు ఆర్టికల్ 370, ఉమ్మడి పౌరస్మృతి, రామమందిర నిర్మాణాలపై ప్రకటనలు చేస్తూ బిజెపి నాయకులు ప్రజల మధ్య వైషమ్య బీజాలను నాటుతున్నారు. అధికారం పొందటానికి ముజఫర్‌నగర్ కలహాలను సృష్టించడానికి వెనుదీయని బిజెపి, అధికారాన్ని నిలుపుకునేందుకు మతకలహాలను రెచ్చగొట్టడానికి వెనుకాడదన్నది స్పష్టమే. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో బిజెపి, ఎస్‌సిలకు మూడవతరంలో రిజర్వేషన్లు రద్దుచేస్తామని ప్రకటించి ఎస్‌సిలను చీల్చే వర్గీకరణ సమస్యను మరో రూపంలో ప్రవేశపెట్టింది. అధికారాన్ని కోల్పోయిన కాంగ్రెసు పార్టీకూడా మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకు ఏమాత్రం జంకదన్న విషయాన్ని దానిచరిత్ర గమనంలో వున్న (భింద్రన్‌వాలేకు మద్దతూ, ఢిల్లీలో సిక్కుల ఊచకోత, బాబ్రిమసీదు తాళాలు తెరిచి రామమందిర శిలాన్యాస్‌కు అనుమతి మొదలగునవి) వారందరికీ స్పష్టమే. బ్రిటీషు వలసపాలకుల వారసులుగా భారత దోపిడీ పాలక వర్గాలు కుల, మత, ప్రాంతీయ వైరుధ్యాలను విభజించి-పాలించు విధానంగా అమలు జరపడంలో ఆరితేరాయని గత 60 ఏళ్ల అనుభవం కూడా నిరూపిస్తున్నది.

ఈ పరిస్థితిలో పాలకవర్గాల విభజించి-పాలించే కుట్రలను ప్రజలను వివరించి, వాటికి లోనుకాకుండా ప్రజల ఐక్యతను నెలకొల్పటం ప్రజాస్వామిక, విప్లవ శక్తుల కర్తవ్యం. కులాలు, మతాలు, ప్రాంతాలమధ్య విద్వేషాలను రగిల్చే శక్తుల చర్యలను ప్రజలముందు బహిర్గత పరిచి, ఈ శక్తులపట్ల ప్రజలలో జాగరుకతను పెంపొందించటం, తద్వారా ప్రజలమధ్య ఐక్యతను కాపాడటం మనందరి కర్తవ్యం. ప్రజల జీవితాలను కష్టాలమయం చేస్తున్న మౌలిక సమస్యలపై ప్రజలను సంఘటితపరిచి పోరాటాలను నిర్మించటం విప్లవకారుల కర్తవ్యం.

ఈ క్రింది మౌలిక కర్తవ్యాల సాధనకు ప్రజానీకాన్ని చైతన్యవంతులను గావించుతూ, తక్షణ డిమాండ్ల సాధనకై ప్రజలను సన్నద్ధులను చేసి పోరాటాలకుపక్రమించాలి!

### కర్తవ్యాలు :

1. దున్నేవానికే భూమి ప్రాతిపదికన విప్లవ భూ సంస్కరణల అమలు కోసం రైతుకూలీ పేదలంతా సంఘటిత శక్తిగా నిలబడి పోరాడాలి.
2. విదేశీ పెట్టుబడులను జాతీయం చేయాలి.
3. జాతీయ పరిశ్రమలను అభివృద్ధి చేయాలి.
4. భూమి, నీరు, అడవిపై ఆదివాసుల హక్కుల పరిరక్షణకై పోరాడాలి.
5. నీటి వనరుల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి. జలవనరులపై రైతాంగ హక్కును పరిరక్షించుకోవాలి.
6. జల వనరుల వినియోగంలో సాగు భూములకు నీరివ్వడానికి ప్రాధాన్యతనివ్వాలి.
7. వ్యవసాయరంగంలో కార్పోరేటీకరణను తిప్పికొట్టాలి.
8. ద్రవ్యరూపంలో విదేశీ పెట్టుబడుల చొరబాటును నిరోధించాలి

### డిమాండ్లు :

**1. రైతాంగం :**

అ. పంటఖర్చుల ప్రాతిపదికన, స్వామినాథన్ కమీషన్ సిఫార్సుల ప్రాతిపదికగానైనా గిట్టుబాటు ధరలను ప్రకటించాలి.

ఆ. మార్కెట్ యార్డులను రైతుకమిటీల అధీనంలో ఉంచాలి.

ఇ. రైతులకు సాధారణ వడ్డీ, వ్యవసాయరంగానికి అవసరమైన రుణసౌకర్యాలు కల్పించాలి.

ఈ. నీటిపారుదల సౌకర్యాల కల్పనలో రైతాంగ హక్కులు పరిరక్షించాలి.

ఉ. వ్యవసాయ రంగంలో భవిష్య వ్యాపారం, చట్టా వ్యాపారాలను నిషేధించాలి.

ఊ. విద్యుత్తు, ఎరువులు, విత్తనాల రంగంలో స్వావలంబన విధానం అమలు చేయాలి.

ఎ. పంటల ధరల నిర్ణయంలో మార్కెట్టు శక్తుల ప్రమేయం ఉండరాదు.

**2. వ్యవసాయకూలీలు :**

అ. వ్యవసాయకూలీలకి కనీస వేతనాల చట్టాన్ని సవరించి సక్రమంగా అమలుజరిపే యంత్రాంగాన్ని ఏర్పరచాలి.

ఆ. కౌలుదార్లను అందరినీ రిజిస్టరు చేసి 1/3 వంతు కౌలు రేటు నిర్ణయించి, కౌలుదార్లకి రుణసౌకర్యం కల్పించాలి.

ఇ. గ్రామీణ చేతి వృత్తులను పరిరక్షించేందుకు అన్ని చర్యలు చేపట్టాలి.

**3. గిరిజనులు :**

అ. 1/70 రెగ్యులేషన్సు, 7/2004 పంచాయితీరాజ్ సవరణ చట్టాన్ని అమలు చేసి గ్రామసభల ద్వారా ఆదివాసీ ప్రాంతాల భూమి సమస్యలు పరిష్కరించాలి.

ఆ. 1/70 రెగ్యులేషన్ అమలు జరిపి ఆదివాసులకు భూమిని తిరిగి అప్పగించాలి.

ఇ. 4/2005 చట్టాన్ని అమలు జరిపి గ్రామసభలకు అధికారాలు అప్పగించాలి.

ఈ. గ్రామసభల ఆమోదం లేకుండా భూములను, అడవులను అభివృద్ధి సాకుతో వినియోగించరాదు.

ఉ. 2006 ఆదివాసీ హక్కుల చట్టం పై కోర్టు స్టేలను తొలగించి, వన్యప్రాణి సంరక్షణ పేరిట తర తరాలుగా అడవులలో నివశిస్తున్న ఆదివాసులను తొలగించరాదు. ప్రాజెక్టులు, మైనింగు పేరిట ఆదివాసుల గెంటివేతను నిలిపివేయాలి.

(తరువాయి 7వ పేజీలో)

# 'ప్రజాసమస్యలపై పాలకపార్టీల అభ్యర్థులను నిలదీయండి'

**చీరాల, మే 3, 4 తేదీలు, 2014 :**

పిడిఎస్ఓ, ఎన్వైయస్‌ల ఆధ్వర్యంలో చీరాల, వేటపాలెం మండలాల్లో విద్యార్థి-యువజనులు చీరాల మండలంలోని ఈపూరుపాలెం, తోటవారి పాలెం, బుర్లవారిపాలెం, పందిళ్ళపల్లి, కొత్త ఇళ్ళు, రామన్నపేట, బాపయ్యనగర్, నాయనిపల్లి, రావూరుపేట, వేటపాలెం, ఆణుమల్లిపేట, రామానగర్, శాంతినగర్‌లలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఓట్లకోసం వస్తున్న పాలకపార్టీల నాయకులను నిలదియ్యమని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. తీరప్రాంతంలో ప్రభుత్వం గుంజుకున్న వాన్‌పిక్ భూములను రైతులకు తిరిగి ఇప్పించాలని, చేనేతవృత్తిని రక్షించాలని, కార్మికుల జీవన భృతిని, ప్రమాణాలను మెరుగుపర్చాలనీ, ఇసుక అక్రమ తరలింపును నిలువరించాలని, కబ్జాకు గురైన భూములను పేదలకు పంచాలని, గ్రామాల్లో మద్యం, బెల్టుషాపులు తొలగించే కృషి చేపట్టాలని, విద్యార్థులకు - ఉచిత విద్య అందించేలా ప్రభుత్వ పాఠశాలలు నిర్మించాలని, ప్రజలందరికి ఉచిత వైద్యం అందించేందుకు ఆసుపత్రులు నిర్మించి అభివృద్ధి పరచాలని, నియోజకవర్గంలోని యువత మొత్తానికి పనికల్పించేలా గ్రామీణ చిన్న, మధ్యతరహా, వ్యవసాయాధారిత, పరిశ్రమలను నిర్మించి పని చూపాలని, ఇళ్ళులేని నిరుపేద లందరికి ఇళ్ళు, నివేశనా స్థలాలు మంజూరు చేసేలా రాజకీయ నాయకులపై ఒత్తిడి తీసుకురావాలని పిడిఎస్ఓ - ఎన్వైఎస్ నాయకులు ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో పిడిఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ ఎస్.కె.బాజీసైదా, రాష్ట్ర నాయకులు కా॥ రమణ, బసవయ్య, సహదేవ్; నాగూర్, బాజీ, ఎన్వైఎస్ రాష్ట్ర నాయకులు ఎ. సతీష్; సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ✡

# 'ప్రజా సమస్యల పరిష్కారానికై పాలకపార్టీల అభ్యర్థులను నిలదీయండి'

## పిడిఎస్ఓ - ఎన్వైయస్‌ల ఆధ్వర్యంలో మంగళగిరి ప్రాంతంలో విస్తృత ప్రచారం

**మంగళగిరి, ఏప్రియల్ 2014 :**

మంగళగిరి నియోజకవర్గంలో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, మంగళగిరిలో సూపర్‌స్పెషాలిటీహాస్పిటల్ నిర్మించాలని, వడ్లపూడిలో నీటిని కలుషితం చేస్తున్న కోకోకోలా కంపెనీని ఎత్తివేయాలని, తగిన చర్యలు చేపట్టాలని, కొండవీటి వాగు ముంపును పరిష్కరించాలని, బేతపూడి మీదుగా వేయదలచుకున్న బైపాస్ ప్రతిపాదనను వెనుకకు తీసుకోవాలని, మంచికలపూడి వద్దగల కాఫీపొడి ఫ్యాక్టరీ కాలుష్యంపై చర్యలు చేపట్టాలని, కె.సి వర్క్స్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు న్యాయం చేయాలని, నియోజకవర్గ పరిధిలో ఉన్న పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్ళలో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బందిని నియమించి, అభివృద్ధి చేయాలని, ప్రజలు, రైతాంగం, కార్మికులు, విద్యార్థులు, యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై మన ముందుకు వస్తున్న పాలకవర్గ, రాజకీయ నాయకులను ప్రశ్నించాలని ప్రజలకు విజ్ఞప్తిచేస్తూ రాష్ట్రంలో 14వ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పిడిఎస్ఓ-ఎన్వైయస్‌ల ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలోని 32వార్డులలోనూ, ఎర్రబాలెం, నవులూరు, శిబిరం, బాపూజీనగర్, నిడమర్రు, కురగల్లు, నీరుకొండ, చినకాకాని, వెంకటరెడ్డిపాలెం, కాజా, ఆత్మకూరు, పెదవడ్లపూడి, నూతక్కి గ్రామాలలో; తాడేపల్లి మండలంలోని డోలాస్ నగర్, ప్రకాశ్‌నగర్, ఉండవల్లి, పెనుమాక, తాడేపల్లి, సుందరయ్యనగర్, మెల్లెంపూడి, గుండిమెడ, పాతూరు, కుంచనపల్లి, కొలనుకొండ, వడ్డేశ్వరం, చిలువూరు గ్రామాలలోనూ; దుగ్గిరాల మండలంలో చినరావూరు, రేవేంద్రపాడు, మంచికలపూడి, శృంగారపురం, కొత్తపాలెం, దుగ్గిరాల, మారెంపూడి గ్రామాలలో కరపత్రాలు, సమావేశాలతో విస్తృత ప్రచారం నిర్వహించారు.

ఈ ప్రచార బృందానికి పిడిఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. బాజీసైదా, పిడిఎస్ఓ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి. బసవయ్య, కె.వి. రమణలు నాయకత్వం వహించగా, పిడిఎస్ఓ - ఎన్వైయస్ నాయకులు కార్యకర్తలు పాల్గొని 12 రోజులపాటు విస్తృత ప్రచారం నిర్వహించారు. ✡

# 'మంగళగిరి టి.బి. శానిటోరియం ప్రాంగణంలో సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను ప్రభుత్వమే నిర్మించాలి'

**మంగళగిరి, 21-4-14 :**

పిడిఎస్ఓ-ఎన్వైయస్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ నన్నపనేని లక్ష్మి వైష్ణవి కళ్యాణమండపంలో నిర్వహించిన సభకు ఎన్వైయస్ జిల్లా వర్గసభ్యులు వి. దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించగా డా॥ కొల్లా రాజమోహన్ ఈ సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడుతూ 2010లో శ్రీనాథ్ కమిటీ నివేదిక - యూనివర్సల్ వైద్యం అందించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నప్పటికీ, ప్రభుత్వం ఆ కమిటీ సూచనలను బుట్టదాఖలు చేసిందన్నారు. మరోవైపు ప్రభుత్వ వైద్యరంగాన్ని, ఫార్మసీ రంగాన్ని కార్పొరేట్ చేతులలోపెట్టి ప్రణాళికలను రూపొందిస్తున్నదని, నేటికీ 70% మంది ప్రజలు 2400 క్యాలరీల ఆహారాన్ని కూడా పొందలేని స్థితిలో నిత్యం అనారోగ్యాల పాలౌతూ అప్పుల పాలవ్వాల్సిన పరిస్థితులలో ప్రభుత్వమే వైద్యం అందించాల్సిన బాధ్యత ఉందని, మంగళగిరిలో 210పైగా ఎకరాల టి.బి. శానిటోరియంలో సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ నిర్మించినట్లయితే గుంటూరుజిల్లా, కృష్ణాజిల్లా, ప్రకాశంజిల్లాలలోని పేద ప్రజలకు ఉచిత వైద్యం అందే అవకాశం ఏర్పడుతుందన్నారు.

పెనుమాక సర్పంచి పానకాలరెడ్డి మాట్లాడుతూ ప్రజాసమస్యలను పట్టించుకొని పార్టీలు ఉచిత నినాదాల జల్లు కురిపిస్తున్నాయని, ఇలాంటి పరిస్థితులలో విద్యార్థి యువకులు ప్రజలను చైతన్యవంతం చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నన్నపనేని నాగేశ్వరరావు మాట్లాడుతూ, సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ మాత్రమే కాకుండా ఆల్ ఇండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్ రావడానికి కూడా సంఘటితంగా కృషిచేయాలన్నారు. నిమ్రా కాలేజి ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ, టి.బి. శానిటోరియంలో సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్‌ను రాజకీయ గొడవగా పాలకులు మార్చారని, ఇలాంటి పరిస్థితులలో విద్యార్థి యువకులు గ్రామాలలో మరింత ప్రచార కార్యక్రమాన్ని తీసుకోవాలన్నారు. ఓపిడిఆర్ జిల్లా కార్యదర్శి పాపారావు మాట్లాడుతూ, వైద్యరంగానికి 6% నిధులు కేటాయిస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ వాస్తవంగా 0.5-1% నికి మించట్లేదన్నారు. అందె నర్సింహారావుగారు మాట్లాడుతూ, ప్రభుత్వమే ప్రైవేటు కార్పొరేటు హాస్పటల్స్‌కు కావల్సిన నిధులను సమకూర్చుతూ ప్రభుత్వ వైద్యరంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదన్నారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు జగ్గవరపు సుబ్బారావు మాట్లాడుతూ, విద్యార్థి యువకులు ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతో ప్రజలను సమస్య పరిష్కారాలపై చైతన్యవంతులుగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఆళ్ళ సాంబిరెడ్డి, దండా ప్రసాద్, ముప్పవరపు వెంకటరెడ్డి, భాస్కర్‌రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ✡




# చుండూరు దళితుల హత్య కేసు

## హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఎన్వైయస్ ప్రదర్శన



ఎన్వైయస్ ఆధ్వర్యంలోనిరసన ప్రదర్శన

**గుంటూరు, 22-4-14 :**

చుండూరు దళితుల హత్యకేసులో అందరినీ నిర్దోషులుగా విడుదలచేస్తూ హైకోర్టు ధర్మాసనం 22-4-2014న తీర్పు నిచ్చింది.

ఈ అక్రమమైన, అప్రజాస్వామికమైన హైకోర్టు తీర్పును ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించాలని, బాధిత దళిత ప్రజల తరుఫున కదలిరావాలని పిలుపునిస్తూ తీర్పు వెలువడిన వెనువెంటనే స్పందించి నవయువసమాఖ్య నగరకమిటిఆధ్వర్యంలో గుంటూరు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎన్వైయస్ నగర కార్యదర్శి కా॥ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగానూ, గొప్ప రాజ్యాంగబద్ధ పాలనా వ్యవస్థగల దేశంగానూ కీర్తించబడుతున్న మనదేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ చట్టాలు, న్యాయవ్యవస్థ మొదలగు విభాగాలు భూస్వామ్య పెత్తందారి పాలక వర్గాల అదుపాజ్ఞలలోనే వ్యవహరిస్తున్నాయనడానికి చుండూరు దళితుల మారణకాండ కేసులో నరహంతకులను నిర్దోషులుగా తేల్చి కేసును కొట్టివేసిన హైకోర్టు తీర్పే నిదర్శనమన్నారు. ఈ తీర్పు దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలపై భూస్వామ్య, అగ్రకులతత్వ, ఉన్మాదశక్తుల దాడులకు, ఆగడాలకు మరింత ఊతమిచ్చేదిగా వున్నదని, మరోప్రక్కన రాజ్యాంగ చట్టాలు, న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థల ద్వారా తమకు న్యాయం దక్కదని దళిత ప్రజలకు మరోసారి స్పష్టమైందని, ఈ తీర్పు - అగ్రకులతత్వ శక్తులు తమ రాజకీయ, అర్థబలంతో ఉన్నత న్యాయస్థానాలలో సైతం నెగ్గుకురాగలమనే ధీమాను మరింతగా పెంచాయన్నారు. మొత్తంగా పీడిత, దళిత, అణగారిన ప్రజలకు ఎప్పుడైనా, ఎక్కడైనా న్యాయం దక్కడం ఎండమావేనని రుజువైందని, కాబట్టి బాధితులకు సరియైన న్యాయపరిష్కారం కోసం దళితులు, మేధావులు, ప్రజాతంత్రవాదులు, ప్రజలందరూ ఉద్యమించాలని విజ్ఞప్తిచేశారు.

ఈ కార్యక్రమంలో ఇంకా ఎన్వైయస్ నాయకులు కా॥ అనిల్ తదితరులు పాల్గొన్నారు. ✡

# మద్యం ఉత్పత్తి, అమ్మకాలను నిలిపివేయాలని పిడిఎస్ఓ-ఎన్వైయస్ ప్రచార కార్యక్రమం

**రేపల్లె, మే 15-23 తేదీలు 2014 :**

ప్రజలు తమ నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలు, వాటికి కారకులు ఎవరు అన్నవి గుర్తెరిగి ప్రజలు చైతన్యవంతులు కాకుండా ఉండేందుకు, పాలకులు తమ దోపిడీ పాలనను కొనసాగించేందుకు, ప్రజల ఆస్థులను కొల్లగొట్టడం కోసం, ప్రజల మెదళ్ళను మొద్దుబార్చడంకోసం, మద్యం-మత్తుపదార్థాల అమ్మకాలద్వారా లక్షల కోట్లు గడించడంకోసం పాలకులు అనుసరిస్తున్న మద్యం, మత్తుపదార్థాల ప్రోత్సాహక విధానాలను బట్టబయలు చేస్తూ, ప్రజలంతా పాలకుల కుట్రలకు బలికాకుండా, ఉన్నతమైన ఆరోగ్యకర సమాజం కోసం మద్యం మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సంఘటిత ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిస్తూ మే 15 నుండి 23వ తేదీవరకూ రేపల్లె ప్రాంతంలో - రేపల్లె, ఇసుకపల్లి, బేతపూడి, పేటేరు, నిజాంపట్నం, గోకర్ణమఠం, హార్బర్, మిలటరీకాలనీ, రాజోలు, గూడవల్లి, చెన్నుపల్లివారి పాలెం, తదితర గ్రామాల్లో విస్తృతంగా పిడిఎస్ఓ - ఎన్వైయస్ జిల్లాకమిటీల ఆధ్వర్యంలో వీధిప్రచారం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎన్వైయస్ జిల్లాకమిటి సభ్యులు కా॥ఎమ్.రాజేశ్వరి, దుర్గాప్రసాద్, అధ్యక్షులు కె.శ్రీను, పిడిఎస్ఓ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు -బి.నాగబసవయ్య, కె.వి.రమణ, జిల్లా కమిటి సభ్యులు పి.రాహుల్, నాగూర్, పిడిఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కె.బాజీసైదా, రాష్ట్రకమిటి సభ్యులు సహదేవ్, ఇంకా విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు. ✡

# కామ్రేడ్ చంద్ర శ్రీమన్నారాయణ వర్థంతి సభ

**నందిగామ, 12-5-14 :**

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) నాయకులు కా॥ చంద్ర శ్రీమన్నారాయణ వర్థంతి సందర్భంగా కమ్మవారిపాలెం గ్రామంలో స్థూపంవద్ద రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ ఎం.రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో రైతుకూలీసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥వీరబాబు మాట్లాడుతూ-దోపిడీ, పీడన, అణచివేతలు లేని నూతన సమాజంకోసం కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన ఎందరో యోధులు పోరాడి ప్రాణత్యాగాలు చేసారని గుర్తు చేశారు. పోరాడకుండా దోపిడీ వ్యవస్థ రద్దుకాదని అన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యం, ప్రకృతి వనరులు మొదలగు వాటిని కార్పొరేట్ వర్గాలు అభివృద్ధి పేరుతో హస్తగతం చేసుకుంటున్నట్లుగానే తమ దోపిడీకి అనుకూలమైన విధాన నిర్ణయాలను చేసుకోవటానికి నేరుగా చట్ట సభలలోకి వెళ్ళటానికి ఈ ఎన్నికలలో పోటీచేసి వందలకోట్ల రూపాయలను ఖర్చుచేస్తున్నారని వివరించారు.

ప్రస్తుత వ్యవస్థలో ఎన్నికల ద్వారా శ్రామిక, మధ్యతరగతి వర్గానికి అధికారం రాదని, దోపిడీ, పెత్తనానికి వ్యతిరేకంగా పేదరికం, నిరుద్యోగం మొదలగు సమస్యల పరిష్కారానికి అమరులు చూపిన విప్లవ బాటలో ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం నాయకులు కాసరెల్లి మస్తాన్, ఆర్. కోట్యానాయక్ తదితరులు పాల్గొని అమరులకు నివాళులర్పించారు. ✡






లెనిన్ ప్రసిద్ధ రచన
రాజ్యమూ – విప్లవమూ
కుప్తీకరణ : ఎన్.వి.యస్. నాగభూషణ్
ప్రచురణ : టి.ఎన్. మెమోరియల్ ట్రస్ట్
వెల : రూ. 20/-
ప్రతులకు : మైత్రీబుక్‌హౌస్
28-9-1, జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 2

## కర్నూలు జిల్లా...(చివరిపేజీ నుండి)

నాగలికర్రులు, అడవిలో పుల్లరికి వ్యతిరేకంగా, ఫారెస్టు బంజరుల కోసం, శివాయిల్లనూ, బంచరాయి భూముల కోసం ఆందోళనోద్యమాలు తీవ్రమయ్యాయి. కమ్యూనిస్టుల ప్రభావానికి అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం నిర్ణయించుకొని నిర్బంధ విధానాన్ని అమలు జరిపింది. రహస్య సాహిత్యం కలిగి వున్నారనే నెపంతో జిల్లాలోని కమ్యూనిస్టు నాయకుల ఇళ్లను సోదాచేసింది. కామ్రేడ్స్ చంద్ర పుల్లారెడ్డి, భాగయ్య, కె.వి. కృష్ణమూర్తి, తిప్పారెడ్డి, బెల్లంకొండ శాయన్న, వి.రామకోటిశాస్త్రి తదితరులను అరెస్టు చేసి, 3 మాసాలు, 6 మాసాలు జైలు శిక్షలు విధించింది. ఈ నిర్బంధకాండ ఫలితంగాను, మరికొన్ని కారణాలతో జిల్లా కమ్యూనిస్టు కార్యక్రమాలు స్తబ్దతకు గురయ్యే స్థితి నుంచి రాష్ట్ర నాయకత్వం చేసిన నిర్మాణ ఏర్పాట్లతో అధిగమించి పార్టీ కృషి ద్విగుణీకృతం చేయబడింది.

1944 - 45 నాటికి ఆంధ్రదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం జమీందారీ, జాగీర్దారీ ప్రాంతాలలో ఉధృత రూపం తీసుకొంది. హైదరాబాద్ సంస్థానంలో నిజాం నవాబు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ఆంధ్ర మహాసభ కార్యక్రమాలు, రైతాంగ విప్లవపోరాటాలు పుంజుకో సాగాయి. తెలుగు భాషోద్యమం విస్తరించింది. భూస్వామ్య దొరల బానిస పద్ధతులను ధిక్కరించే రైతాంగ ఉద్యమాలు ఊపందుకుంటున్న రోజులలో కర్నూలు జిల్లా కమ్యూనిస్టులు తమ సహకారాన్ని, అండదండల నందించారు. హైద్రాబాద్ నిజాం సంస్థానానికి సరిహద్దుగా వున్న కర్నూలు జిల్లా అడవి ప్రాంతం రక్షణ దుర్గంగా వుపయోగించ బడింది. తెలంగాణా రైతాంగ పోరాటంలో కర్నూలు జిల్లా కామ్రేడ్స్ తగుపాత్రను తాము పోషించారు. మండ్ల సుబ్బారెడ్డి తదితరులు నల్లమల ఫారెస్టు రీజనల్ కమిటీలో వుంటూ దాని ఆధ్వర్యాన సాయుధ దళాలను నిర్వహించారు. 1952లో జరిగిన ఎన్నికల్లో కా॥ పుల్లారెడ్డి నందికొట్కూరు నియోజకవర్గం నుండి మద్రాసు అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

కమ్యూనిస్టు ఉద్యమం మితవాద, అతివాద ఒంటెత్తు విధానాలకు గురై, విప్లవ రైతాంగ ఉద్యమాలు వెనుక పట్టుబట్టాయి. తెలంగాణ రైతాంగ పోరాటం విరమించబడింది. 1956 నుంచి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో రివిజనిస్టు ధోరణులు తలెత్తాయి. వాటి ప్రభావం భారత కమ్యూనిస్టు ఉద్యమంపై కూడా పడింది. పార్టీలో విభేదాలు, ముఠాల ఏర్పాటుకు దారితీసింది. 1962-63లో పార్టీ చీలిపోయింది. కర్నూలుజిల్లా కమ్యూనిస్టు ఉద్యమం గూడ చీలికలకు గురైంది. కామ్రేడ్స్ చంద్ర పుల్లారెడ్డి, మండ్ల సుబ్బారెడ్డి, నీలం రాంచంద్రయ్య, టి. నరసింహయ్యగారలు సిపిఐ నుంచి విడిపోయి సిపిఐ(యం) వైపు నిలబడ్డారు. 1968లో సిపిఐ(యం)లో వచ్చిన చీలికలో టి. నరసింహయ్య మినహా మిగిలిన కామ్రేడ్సందరు విప్లవ కమ్యూనిస్టుల పక్షాన నిలబడ్డారు. సిపిఐ (యం)లో రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడిగా రాష్ట్ర కేంద్రంలో వుండి తనకిచ్చిన బాధ్యతలు నిర్వహిస్తూ సిద్ధాంత చర్చలలో చురుకైన పాత్ర నిర్వహించాడు కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి. కమ్యూనిస్టు పార్టీని విప్లవాత్మకపార్టీగా మలచాలనీ, సమరశీల ఉద్యమాలను నిర్మించాలనీ, భూస్వాముల దౌర్జన్యాలు, హత్యాకాండల నరికట్టడానికి, ప్రజా ప్రతిఘటనలను నిర్మించాలని కామ్రేడ్స్ తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, కొల్లా వెంకయ్య, చంద్ర పుల్లారెడ్డి తదితర కామ్రేడ్స్ నిర్ణయించుకొన్నారు. వీరంతా ఒక సమన్వయంగా సిపిఐ(యం)లో వుంటూనే, ఆంతరంగిక పోరాటం సాగిస్తూనే, విప్లవోద్యమ రక్షణకు నిర్మాణానికి చర్యలు రూపొందించి నిర్వహించారు.

జాతీయ విముక్తి ఉద్యమాలకు సంఘీభావ కార్యక్రమాలు సాగిస్తూ అమెరికా యొక్క సామ్రాజ్యవాద దురాక్రమణ చర్యలకు వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగించారు. యువజన విద్యార్థులకు రాజకీయ, సిద్ధాంత అవగాహనను పెంపొందించటానికి రాజకీయ క్లాసులు నిర్వహించారు.

సిపిఐ (యం) కేంద్ర కమిటీ మదురైలో ఆమోదించిన సిద్ధాంత డాక్యుమెంటుపై నిర్వహించిన ఆంతరంగిక చర్చలు కేంద్రీకృత ప్రజాస్వామిక పద్ధతికి భిన్నంగా నిర్వహించినప్పటికీ ఓపిక వహించి, ప్రత్యామ్నాయ డాక్యుమెంట్లు రూపొందించి, జిల్లా స్థాయి నుంచి అఖిల భారత స్థాయి వరకు జరిగిన ప్లీనం సమావేశాలలో పాల్గొని తమ వాదనను వినిపించారు. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి ఈ దశలో మంచిపాత్ర నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ విప్లవ విభాగానికి చెందిన నలుగురు నాయకులు సాగించిన ఈ సిద్ధాంత పోరాటం చాలా కీలకమైనది. జాతీయ విముక్తి ఉద్యమాలపాత్ర, సామ్రాజ్యవాద నయావలస దురాక్రమణ యుద్ధాలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ఐక్య సంఘటన నిర్మాణ సమస్యపై విభేదం కీలకమైన సమస్యగా చర్చ సాగింది. వలస, నయావలస దేశాలలో భూస్వామ్య విధానం, దళారీ బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా జరప వలసిన పోరాటాలతో సామ్రాజ్యవాద దురాక్రమణలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలను జతచేయవలసిన కర్తవ్య ప్రాధాన్యతను విడనాడటం గానీ, నీరుగార్చడం గానీ చేయరాదని ఎలుగెత్తిచాటారు. దేశీయంగా భూస్వామ్య పెత్తందారీ దోపిడీ పీడనల నుంచీ, సామ్రాజ్యవాద నయావలస దోపిడీతో కుమ్మక్కైన భారతదళారీ - బడాబూర్జువా వర్గాలకు వ్యతిరేకంగా భారత ప్రజలు నిర్వహించవలసిన పాత్ర గురించి - వారు సాగించ వలసిన పోరాట పంథా గురించి అంతర్జాతీయ సిద్ధాంత చర్చల వెలుగులో; భారతదేశ విప్లవ పోరాటాల వెలుగులో ఒక స్థూలమైన పంథాను నిర్దేశించుకొని నాయకత్వం వహించారు. దాని కనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితిని దోపిడీ పాలకవర్గాల అణచివేత చర్యలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలకు అంకురిస్తూన్న పోరాటాలకు మార్గనిర్దేశం చేశారు. నక్సల్‌బరీ రైతాంగ పోరాటానికి సంఘీభావం తెలియజేస్తూనే అక్కడ పుడుతూ, వ్యాప్తి చేయబడుతున్న తప్పుడు ధోరణులను గమనిస్తూ, విడగొట్టుకొంటూ వచ్చారు. ప్రజాప్రతిఘటన - పాలక యంత్రాంగం - చట్టబద్ధ, పార్లమెంటరీ పోరాటరూపాల పట్ల గతితార్కిక వైఖరితో ఒక విప్లవకర దృక్పథాన్ని రూపొందించారు. ప్రజాపోరాటాలు నిర్మించటానికి, విప్లవకరపార్టీ నిర్మాణాన్ని ఏర్పర్చటానికి సన్నాహక చర్యలు చేబట్టారు. విప్లవ కేంద్రాల ఏర్పాటు దృక్పథాని కనుగుణంగా నిర్మాణ ఏర్పాట్లు చేశారు. కామ్రేడ్ దేవులపల్లి నాయకత్వంలో తెలంగాణా ప్రాంతం, గోదావరిలోయలో కేంద్రీకృత కృషి చేయాలని నిర్ణయించారు. ములుగు ఏరియాకు కా॥ పి. రామనర్సయ్య, ఖమ్మం ఏరియాకు కామ్రేడ్ పుల్లారెడ్డిలకు నాయకత్వ బాధ్యతలివ్వబడ్డాయి. శ్రీకాకుళ గిరిజనోద్యమంపై పాలకవర్గాల అణచివేత దాడుల నుంచి రక్షించుకునేందుకు డైరెక్షన్‌ను రూపొందించారు. శ్రీకాకుళం జిల్లా కామ్రేడ్స్ ఈ చర్యలు విప్లవాత్మకంగా లేవని కామ్రేడ్ చారుమజుందార్ ప్రచారం చేస్తున్న రాజకీయ వైఖరి - గ్రామాలలో ప్రజాధికారాన్ని నెలకొల్పిన తర్వాతనే భూమి తదితర సమస్యలు పరిష్కారమౌతాయని గనుక ముందు గ్రామాలలోని భూస్వామ్య అధికార యంత్రాంగాన్ని, దానికి రక్షణగా వస్తున్న పోలీసు యంత్రాంగాన్ని ప్రతిఘటించమనే వైఖరితో రైతాంగ సంగ్రామ సమితుల నిర్మాణం ప్రథమ కర్తవ్యమనే ప్రబోధానికి గురయ్యారు. రాష్ట్ర నాయకత్వ సూచనలు విప్లవాత్మకంగా లేవని రాష్ట్ర కమిటీ నాయకత్వం నుంచి విడగొట్టుకొన్నారు. బండికి గుర్రాన్ని వెనక కట్టడమంటే ఇదేనని ఆంధ్రరాష్ట్ర నాయకత్వం చారుమజుందార్ విధానం పైన వ్యాఖ్యానించింది. అదే విధానం క్రమంగా ప్రజలతో సంబంధంలేని రహస్య "ఖతం" కార్యక్రమానికి దారితీసింది. నక్సల్‌బరీ పోరాటం అక్కడే ఆగిపోయింది. శ్రీకాకుళ ప్రజాఉద్యమం ప్రక్కదారి పట్టింది. ఏదిఏమైనప్పటికీ భిన్నాభిప్రాయాలతో ఏఐసిసిసిఆర్‌లో చేరి విప్లవోద్యమ ఐక్యతకు, విస్తృతికి కృషి చేయాలనే ఆంధ్రనాయకత్వం నిర్ణయించుకొని చేరింది. ఆంధ్రరాష్ట్ర కమిటీ ఇంకా పార్లమెంటరీ భ్రమల్లో వుందనీ, సాయుధ పోరాటానికది సిద్ధంగా లేదనే ప్రచారం జోరు చేయబడింది. రాజకీయ సిద్ధాంత ఆలోచనల స్థానంలో వ్యక్తులు లక్ష్యంగా దుష్ప్రచారం చేయబడింది. అనేకమంది నాయకత్వ కామ్రేడ్స్ ఈ ప్రచారాలతో ముంచెత్తబడి ఊగిసలాటకు గురయ్యారు. కామ్రేడ్స్ నాగిరెడ్డి, దేవులపల్లి, పుల్లారెడ్డిలు ఈ ప్రచారాలకు తలవంచలేదు. "పోరాట ఉద్యమానికి పునాదులు" అన్న ప్రాథమిక డాక్యుమెంటు ఆధారంగా తీసుకొన్న చర్యలు చాలవని "తక్షణ కార్యక్రమం" అన్న డాక్యుమెంటు రూపొందించి 1969 ఏప్రిల్ 13, 14 తేదీలలో జరిగిన ప్లీనం సమావేశానికి ప్రతిపాదించారు. చర్చలు జరిగాయి. డాక్యుమెంటు ఆమోదించ బడింది. అప్పటివరకూ పోరాట ఉద్యమానికి పునాదులు వేయండి అన్న డాక్యుమెంటు ప్రాతిపదికగా జరిగిన కార్యక్రమాల సమీక్ష గూడ చర్చించబడి, ఆమోదించబడింది. ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో పాలకవర్గాల పాత్రను, అది ప్రక్కదారి పట్టించే పాలకవర్గాల కుట్రల ఫలితంగా పుట్టిన ఉద్యమమని సరిగ్గానే నిర్ణయం తీసుకొన్నారు. ఈ వైఖరికి అందులో పాల్గొంటున్న విద్యార్థి, యువకులను అభినందిస్తున్నామని జోడించాలని కా॥ పుల్లారెడ్డి పెట్టిన సవరణ గూడ మెజారిటీ నిర్ణయంతో ఆమోదించబడింది.

అప్పటికే ప్రజాఉద్యమ నిర్మాణంలో దొర్లిన డీవియేషన్ ప్రభావం ఈ సమస్యపై వైఖరి తీసుకోవడంలో గూడ ద్వందాత్మకత వెల్లడయింది. ఈ ద్వందాత్మకత కామ్రేడ్ పుల్లారెడ్డిని చాలాకాలం వెన్నంటి సాగింది. ఇది క్రమంగా తన లైను వేరు. కామ్రేడ్ టి.యన్, డి.వి.ల లైను వేరనే మానసిక స్థితికి గురిచేసింది. ఇది విప్లవోద్యమంలో మరొక డీవియేషన్‌గా ముందుకు వచ్చింది. దానికి అనుగుణంగా రాజకీయ, సిద్ధాంత ప్రచారాలు సాగించబడ్డాయి. కామ్రేడ్ పుల్లారెడ్డి సూత్రప్రాయంగా ఆత్మవిమర్శనాత్మక పరిశీలనకు పూనుకొన్నాడు. ఒక దశాబ్ద కాలం తర్వాత బహిరంగంగా తన ఆత్మవిమర్శను ప్రకటించాడు. విప్లవం పట్ల నిబద్ధత - ఆవేదనల ఫలితమే ఈ ప్రకటన. భావోద్వేగాలకు (సెంటిమెంట్స్) అతీతంగా ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమ సమీక్ష చేయవలసి వుంది. విప్లవోద్యమ ఐక్యత సాధించటానికిది తోడ్పడుతుంది. కామ్రేడ్ పుల్లారెడ్డి ఆవేదనాభరితంగా ఈ విషయాలపై మాట్లాడుతున్న క్రమంలో అమరజీవి కావడం విప్లవోద్యమానికి నష్టం కలిగించింది. తన నాయకత్వంలోని నిర్మాణ సమస్యలు ఏమున్నప్పటికీ కామ్రేడ్ పుల్లారెడ్డి ఆకాంక్ష విప్లవోద్యమ ఐక్యతే. మితవాద, అతివాద పెడధోరణులకు వ్యతిరేక పోరాటం లేకుండా స్వంత నిర్మాణం ఐక్యతగాని, మొత్తం విప్లవోద్యమ ఐక్యతగానీ సాధ్యం కాదనే వాస్తవం పలుమార్లు దర్శనమిచ్చింది.

కామ్రేడ్స్ చంద్ర పుల్లారెడ్డి, మండ్ల సుబ్బారెడ్డి, నీలం రామచంద్రయ్య, ఎ. సుదర్శనవర్మ తదితర కర్నూలు జిల్లా విప్లవోద్యమ పుత్రులు, మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనా విధానం పట్ల నిబద్ధత గల కామ్రేడ్స్ తమ స్వంతం కోసంగాక ప్రజల కోసం, సమాజపురోగమన క్రమం కోసం అహర్నిశలు కృషిచేసిన కామ్రేడ్స్. వీరు త్యాగ ధనులు,ధన్యజీవులు. నేటితరానికి ఆదర్శప్రాయులు. వారి ఆశయాలను లక్ష్యాలను ముందుకు తీసుకు పోవటమే మన బాధ్యత. వారికి విప్లవనివాళు లర్పిస్తూ, వారి ఆశయాలను, లక్ష్యాలను సాధించే కృషికి అంకితమవుదాం. ✡

---

## తెలుగు ప్రజల...(5వ పేజీ తరువాయి)

**4. ప్రాజెక్టులు - నిర్వాసితులు :**

అ. విస్తృతమైన నిష్పాక్షిక ప్రజాభిప్రాయ సేకరణ ఆమోదం తర్వాతే ఏ ప్రాజెక్టునైనా తలపెట్టాలి.

ఆ. సమగ్ర, శాస్త్రీయ పునరావాసం ముందు కల్పించిన తర్వాతే ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి.

ఇ. 1884 నిర్బంధ భూసేకరణ చట్టాన్ని రద్దు చేయాలి.

ఈ. భూమికి భూమి, అడవికి అడవితో సమగ్ర పునరావాసాన్ని కల్పించిన తర్వాతే ప్రాజెక్టులు నిర్మించాలి.

ఉ. జలవనరుల పంపకంలో ప్రాంతాల అసమానతలకి తావు లేకుండా జలవనరుల పంపిణీ జరగాలి.

**5. ఖనిజాలు :**

అ. ఇనుము, బాక్సైట్ తదితర ఖనిజాల తవ్వకంలో సామ్రాజ్యవాదుల దోపిడీకి అవకాశం ఇవ్వడాన్ని ప్రతిఘటించాలి.

ఆ. ప్రజా ఖనిజ విధానం, దేశ భవిష్యత్ అవసరాల ప్రాతిపదికన ఖనిజాల విధానం అమలు జరపాలి.

ఇ. దేశ సహజ వనరులను కారుచౌకగా విదేశీ మార్కెట్ శక్తులకి దోచిపెట్టడాన్ని ప్రతిఘటించాలి.

ఈ. లభ్యమయ్యే ఖనిజాల ఆధారంగా దేశీయ పరిశ్రమలను అభివృద్ధి చేయాలి. రాయలసీమ-రాయదుర్గంలో, తెలంగాణా-బయ్యారంలో వెంటనే ఇనుము, ఉక్కు, కర్మాగారాలను నిర్మించాలి.

ఉ. ఖనిజ వనరులను కారుచౌకకు ఎగుమతి చేయటం మరియు విదేశీ గుత్త కంపెనీలపరం చేయటం ఆపాలి, ప్రజల అవసరాలను తీర్చటం లక్ష్యంగా సహజ, ఖనిజ వనరుల వినియోగం జరగాలి.

**6. పరిశ్రమలు - కార్మికరంగం :**

1. ఎగుమతి ఆధారిత అభివృద్ధి అన్న విధానాన్ని రద్దు చేయాలి. సెజ్‌లు, కారిడార్‌లు వంటి పథకాలను రద్దు చేయాలి.
2. ద్రవ్యరంగంలో విదేశీ కంపెనీలను అనుమతించరాదు.
3. ఫ్యాక్టరీల మూసివేతలను, కార్మికుల తీసివేతలను నిలుపుచేయాలి.
4. ప్రైవేటీకరణ, కంట్రాక్టీకరణ ఆపివేయాలి.
5. 180 రోజులు పనిచేసిన వారందరినీ పర్మనెంటు చేయాలి.
7. ఉపాధిరహిత అభివృద్ధి నమూనాను తిరస్కరించి శ్రమఆధారిత పారిశ్రామికీకరణను ప్రోత్సహించాలి.
8. చిన్న పరిశ్రమలకు రక్షణ కల్పించాలి.
9. ప్రజల అవసరాలను తీర్చే పరిశ్రమలను ప్రోత్సహించాలి.
10. విదేశీ పెట్టుబడులను అనుమతించరాదు.వాటిని జాతీయం చేయాలి.
11. వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధికి స్వతంత్ర, స్వావలంబిత విధానాన్ని అమలు చేయాలి. దాని కొరకు సేవారంగాన్ని అభివృద్ధి పరచాలి.
12. వ్యవసాయ రంగంతో జోడించిన పారిశ్రామికాభి వృద్ధిని సాగించాలి. దీనికి ప్రజావసరాలను తీర్చటం లక్ష్యంగా వుండాలి.

**7. విద్య - సంస్కృతి :**

అ. సార్వజనీన ప్రాథమిక విద్యను ఉచితంగా అందించాలి.

ఆ. సార్వజనీన మాధ్యమిక విద్యను, సామాజిక ఉత్పత్తితో జోడించి శాస్త్రీయ అభినివేశం సాధించాలి. ఈ స్థాయి విద్య ముగిసేసరికి ఉపాధి పొందే నైపుణ్యాన్ని గరపాలి.

ఇ. విద్యా బోధన - పాలన అన్ని స్థాయిల్లో మాతృభాషలో సాగించాలి.

ఈ. ఉన్నత విద్యారంగం ప్రభుత్వ ఆధీనంలో వుండాలి.

ఉ. విదేశీ యూనివర్సిటీలను రద్దు చేయాలి.

ఊ. ఉన్నత విద్య సామాజిక అభివృద్ధికి తోడ్పడే దిశగా శాస్త్రీయత, ప్రజాస్వామికత ప్రాతిపదికగా సాగాలి.

ఎ. మైనారిటీలపై దాడులను ఆపాలి.

ఏ. ముస్లింలను దేశద్రోహులుగా చిత్రించే, మతోన్మాద చర్యలను అణచివేయాలి.

ఐ. హిందూవుల ఆచారాలనే భారతీయతగా, భారత సంస్కృతిగా సాగిస్తున్న చర్యలను నిరసించాలి, అరికట్టాలి.

ఒ. రాజ్య వ్యవహారాలలో మతాన్ని జొప్పించరాదు.

**8. ప్రజా హక్కులు :**

అ. వైద్యం, ఆరోగ్య రక్షణ ప్రభుత్వ రంగంలో వుండాలి.

ఆ. సార్వజనీన ఉచిత ఆరోగ్య సేవలు ప్రభుత్వం నిర్వహించాలి.

ఇ. ప్రజల పొదుపుకు అన్ని రక్షణలూ కల్పించి, వాటిని ప్రజా జీవితాలను మెరుగుపర్చేందుకు పెట్టుబడిగా వాడాలి. ప్రజాధనాన్ని దిగమింగే అవినీతిని అరికట్టాలి.

ఈ. ప్రజల వాక్, సభా, స్వాతంత్ర్యాలనూ, నిరసన తెలిపే హక్కును కాలరాచే చట్టాలను రద్దు చేయాలి.

ఉ. ప్రజా ఉద్యమాలపై తుపాకీ కాల్పులూ, లాఠీఛార్జీలనూ సాగించరాదు.

ఊ. రాజకీయ ఉద్యమకారులపైన పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి, విడుదలచేయాలి.

ఋ. రాజకీయ ఉద్యమంలో పాల్గొన్న కారణంగా అరెస్టు చేసిన వారందర్నీ రాజకీయ ఖైదీలుగా గుర్తించాలి. ✡

# భారత విప్లవకారుల నాయకుడు కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి స్థూపావిష్కరణ - సభ

**వెలుగోడు, 25-5-14 :**

కర్నూలుజిల్లా వెలుగోడు గ్రామంలోని కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి నగర్‌లో కా॥ చంద్ర పుల్లారెడ్డి స్మారక స్థూప ఆవిష్కరణ సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో జరిగింది. వివిధ ప్రాంతాల నుండి ఈ కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలను స్వాగతిస్తూ కామ్రేడ్ సి. పెద్దన్న స్థూప ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటీ సభ్యులు కా॥ అలోక్ ముఖర్జీ స్థూపాన్ని ఆవిష్కరించి కా॥ చంద్ర పుల్లారెడ్డితోపాటు, కా॥ మండ్ల సుబ్బారెడ్డి, కా॥ నీలం రామచంద్రయ్యలకు జోహార్లు చెప్పారు. పార్టీ కేంద్రకమిటీ సభ్యులు కా॥ గుర్రం విజయకుమార్, కా॥ ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు కా॥ కోటయ్య, కా॥ రామన్నగౌడ్, కా॥ భూతం వీరయ్య, కా॥ రాజేష్; రైతుకూలీసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ జె. కిశోర్ బాబు, ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ మల్లేశం, టి.ఎన్.స్మారక ట్రస్ట్ సభ్యులు డా॥ సుధీర్, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కా॥ కొండమ్మ, కా॥ మండ్ల శారద, ఓ.పి.డి.ఆర్ రాష్ట్ర కార్యదర్శి కా॥ హనుమంతరావు, కా॥ బర్నబాసు వివిధ జిల్లాల నుండి వచ్చిన పార్టీ బాధ్యులు స్తూపం వద్ద నివాళులు అర్పించారు. కా॥ సి.పి మనుమడైన కిరణ్, స్థానిక సిపియం నాయకులు కా॥ యాదాటి శ్రీరాములు తదితరులు సి.పి స్థూపంవద్ద పూలువుంచి నివాళులు అర్పించారు. పక్కపక్కనే వున్న కా॥ మండ్ల సుబ్బారెడ్డి, కా॥ చంద్ర పుల్లారెడ్డిల స్థూపాలు ఆ అమరుల త్యాగస్ఫూర్తిని సభికుల గుండెల్లో నింపాయి. కా॥ సిపి, కా॥ ఎమ్ఎస్, కా॥ నీలం రామచంద్రయ్య, కా॥ తరిమెల నాగిరెడ్డి, కా॥ కానూసన్యాల్‌లకు, విప్లవోద్యమాల్లో అమరులకు జోహార్ అంటూ, వారి ఆశయాలు సాధిస్తామన్న నినాదాలతో స్థూపాల ప్రాంగణం మార్మోగింది. ప్రజా కళాకారులు అరుణపతాక ఔన్నత్యంపైనా, అమరుల త్యాగాలపైనా పాడిన పాటలు సభికులలో స్ఫూర్తిని రగిల్చాయి.





కా॥ సిపి స్థూపాన్ని ఆవిష్కరించి ఇతర కామ్రేడ్స్‌తో కలసి నివాళులర్పిస్తున్న కా॥ అలోక్ ముఖర్జీ; కా॥ చంద్ర పుల్లారెడ్డి స్థూపం; ప్రదర్శన

### ప్రదర్శన

వందలాదిగా మహిళలు, పార్టీ కార్యకర్తలు, శ్రమజీవులు అరుణపతాకాలు చేబూని అమరులకు జోహార్లు చెపుతూ బహిరంగ సభా ప్రాంగణమైన వెలుగోడులోని జిల్లా పరిషత్ హైస్కూలు వరకు ఉత్తేజకరంగా ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనకు అగ్రభాగాన పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకులు నడిచారు.

### బహిరంగసభ

వెలుగోడు జెడ్.పి. హైస్కూలులో జరిగిన సభావేదికపై మండ్ల రామసుబ్బారెడ్డి గత 6 నెలలుగా కా॥ సి.పి స్థూప నిర్మాణానికి, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి జరిగిన కృషిని వివరించి, వక్తలను వేదికపైకి ఆహ్వానించారు.

సభాధ్యక్షులు సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర కమిటి సభ్యులు కా॥ పెద్దన్న ప్రసంగిస్తూ - వెలుగోడు గ్రామం ఇద్దరు గొప్ప నాయకులను అందించిందనీ, కా॥ చంద్ర పుల్లారెడ్డి, మండ్ల సుబ్బారెడ్డిగారలు రాష్ట్రంలో, దేశంలో విప్లవోద్యమ నిర్మాణానికి కృషి చేశారన్నారు. కా॥ చంద్ర పుల్లారెడ్డి మద్రాసులోని గిండి ఇంజనీరింగ్ కళాశాలలో చదివే కాలంలో జాతీయ ఉద్యమంలో పాల్గొన్నందుకు కాలేజి యాజమాన్యం ఆయనను కళాశాల నుండి బయటకు పంపిందనీ - ఇక తర్వాత వెనుదిరిగి చూడకుండా 1984 నవంబరు 9న బెంగాల్‌లో మరణించేవరకు విప్లవోద్యమ నిర్మాణంలో కృషిచేసిన తీరును వివరించారు. మండ్ల సుబ్బారెడ్డి స్థూపం పక్కనే కా॥ సి.పి స్థూప నిర్మాణానికి, ఆ స్థూపాల వెనుక కమ్యూనిటీహాలు, గ్రంథాలయ నిర్మాణానికి ప్రజలు అందించిన తోడ్పాటును కొనియాడారు. వెలుగోడు గ్రామంలో ఇండ్లపట్టాలు ఇచ్చి స్థలాలు చూపకుండా ప్రభుత్వాలు మోసగిస్తున్న తీరును వివరించి, వాటి సాధనకోసం సమైక్యంగా సాగాలని పిలుపునిచ్చారు.

ప్రధాన వక్తగా పాల్గొన్న కేంద్రకమిటీ నాయకులు కా॥ అలోక్ ముఖర్జీ - కా॥ సి.పి రాజకీయంగా, సైద్ధాంతికంగా, విప్లవోద్యమ నిర్మాణం కోసం సాగించిన కృషిని గుర్తుచేస్తూ - ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మత ఛాందస శక్తులు ఎన్నిక కావడం ప్రజలకు విషపరిస్థితిని కలిగించిందన్నారు. కార్పొరేట్ శక్తులకు, బహుళజాతి గుత్తసంస్థలకు సేవచేసేందుకు మోడీ సిద్ధపడినందునే ఆ శక్తులు మోడీని భుజానికెత్తుకున్నాయన్నారు. యు.పి.ఏ. ప్రవేశపెట్టిన సంస్కరణలనే - మోడీ మరింత వేగంగా అమలు జరుపుతాడని విశ్లేషించారు. కమ్యూనిస్టులకు గతంలో వచ్చిన సీట్లకంటే బాగా తగ్గిన తీరును ఆయా పార్టీలు సమీక్షించుకోవాలన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం ప్రజలపై సాగిస్తున్న దాడిని వివరించారు. విప్లవకర శక్తులన్నీ అమరుల త్యాగాలస్ఫూర్తితో ఒకే తాటిపైకి వచ్చి ప్రజలకు సారథ్యం వహించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పి అమరులకు జోహార్ అంటూ - వారి ఆశయ సాధనకు పూనుకుందామని పిలుపునిచ్చారు.

పార్టీ రాష్ట్ర నాయకులు కా॥ రామన్నగౌడ్ ప్రసంగిస్తూ - కా॥ సి.పితో కలసి కర్నూలు జిల్లాలో పనిచేసే అవకాశం తనకు కలిగిందన్నారు. పాలకవర్గాలపై యుద్ధంలోకి ప్రజల్ని కార్యోన్ముఖుల్ని చేయడానికి కా॥ సి.పి దేశమంతటా తిరిగి చేసిన కృషిని గుర్తుచేసి - తాము స్థూపాన్ని ఇన్నేళ్ళపాటు నిర్మించలేకపోయిన దానికి క్షమాపణలు కోరుతూ - వెలుగోడు గ్రామ ప్రజల సహకారంతో కార్యకర్తలు దాన్ని నెరవేర్చినందుకు అభినందించారు.

పార్టీ కేంద్రకమిటి నాయకులు కా॥ గుర్రం విజయ్‌కుమార్ - మాట్లాడుతూ ప్రజలు ఇపుడు విషమ పరిస్థితిలో వున్నారనీ - కార్పొరేట్ శక్తులే మోడీని గెలిపించుకొన్నాయనీ - కాంగ్రెస్ సాగించిన అవినీతి, కుంభకోణాల ఫలితంగానే దేశవ్యాపితంగా ప్రజల ఆగ్రహానికి గురైన తీరును చెప్పారు. కేరళలోను, బెంగాల్‌లోను సిపిఎం, సిపిఐలు ఘోరంగా ఓడిపోయిన తీరును ప్రస్తావిస్తూ వామపక్ష శక్తులు సమైక్యవుద్యమాలు నిర్మించాల్సిన అవసరాన్ని వివరించారు.

2004 ఎన్నికలకు ముందు ఆంధ్ర రాష్ట్రంలో సాగిన వామపక్ష ఐక్య కార్యాచరణ ప్రజలకు స్ఫూర్తినిచ్చిందనీ - తిరిగి పునరాలోచించుకొని అలాంటి కార్యాచరణకు వారు పూనుకోవలసిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు.

రైతుకూలీసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ జె. కిశోర్ బాబు ప్రసంగిస్తూ - మొన్న జరిగిన ఎన్నికలు భారత ప్రజాస్వామ్యపు డొల్లతనాన్ని బయటపెట్టాయనీ, ఒకవైపు ఓటు నైతికతను, ఓటు వేయాల్సిన అవసరాన్ని గుర్తింపచేయడానికి ప్రభుత్వంలోని వివిధ శాఖలు పనిచేస్తే - ప్రభుత్వం పెట్టిన చెక్‌పోస్టులను దాటుకొని ప్రజల మధ్య డబ్బు పంపకాన్ని పార్టీలు మునుపెన్నటి కంటే అధికం చేసిన తీరును - మీడియా పాత్రను వివరించారు. ఎన్నికలపుడు అన్నీ ఉచితం అన్నట్లు ప్రకటనలు చేసి - ఎన్నికలయ్యాక ధరలు, పన్నులు పెంచిన తీరును గుర్తుచేశారు. వెలుగోడులాంటిచోట్ల పేదలు జానెడు ఇండ్లస్థలం కోసం పోరాడడమే నేరంగా చూసే పాలకులు, బహుళజాతి కంపెనీలకు వందల, వేల ఎకరాలు ఉచితంగా కేటాయిస్తున్న తీరును పోల్చిచూపి సంఘటితంగా పోరాడితేనే పేదలు తమ హక్కులను సాధించుకోగలుగుతున్నారన్నారు. కా॥ ఎమ్.ఎస్, సి.పిలు చూపిన దారిలో వెలుగోడు పేదలు పోరాడాలని పిలుపునిచ్చారు.

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ కె. కోటయ్య తదితరులు కా॥ సి.పికి, అమరులకు జోహార్లర్పిస్తూ ప్రసంగించారు. అంతర్జాతీయ శ్రామిక గీతంతో సభ ముగిసింది. ✡

కరపత్రం

# కర్నూలుజిల్లా అమరుల స్ఫూర్తితో విప్లవోద్యమ నిర్మాణాన్ని కొనసాగిద్దాం

## సి.పి.ఐ(ఎం-ఎల్) రాష్ట్ర కమిటి

**కర్నూలు** జిల్లా కమ్యూనిస్టు విప్లవ యోధుల సంస్మరణ - పీడిత ప్రజల నాయకుడు, కమ్యూనిస్టు విప్లవనేత కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి స్థూపావిష్కరణ - కమ్యూనిస్టు భావజాల పురిటిగడ్డయిన వెలుగోడు గ్రామంలో, చారిత్రాత్మక నగ్జల్బరీదినాన-మే 25న జరుగుతున్న ఈ సందర్భం ప్రత్యేకమైంది.

మానవుడిని మానవుడు దోచుకోవడమనే నీతిని పాటిస్తున్న దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా కష్టజీవులయిన రైతుకూలీలను, మధ్యతరగతి వర్గాలను శ్రామికవర్గ నాయకత్వాన సంఘటితపరచే కృషికి అంకితమయ్యి తమ జీవితాలనే పణంగా బెట్టిన కమ్యూనిస్టు విప్లవయోధులు ఆదర్శప్రాయులు. వారందరికీ విప్లవ జోహార్లు.

దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టుఉద్యమానికి బీజాలు నాటుకుంటున్న దశలోనే కర్నూలు జిల్లాలో గూడ కమ్యూనిస్టు సిద్ధాంతానికి పునాదులు పడ్డాయి. కాంగ్రెసులో సోషలిజాన్ని కోరుకునేవారు, కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారు నిర్వహించిన రాజకీయ పాఠశాలల్లోనూ; కొత్తపట్నం, మంతెనవారిపాలెం రాజకీయ పాఠశాలల్లో కొంతమంది చైతన్య వంతులయిన కర్నూలు జిల్లా యువకులు పాల్గొన్నారు. సత్యాగ్రహ



కా॥ చంద్ర పుల్లారెడ్డి



కా॥ మండ్ల సుబ్బారెడ్డి



కా॥ నీలం రామచంద్రయ్య

పోరాటాలకే పరిమితమయి స్వాతంత్ర్యాన్ని సాధించలేమని కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకున్న యువకులు కమ్యూనిస్టు భావజాలంవైపు మొగ్గారు. కమ్యూనిస్టు ప్రచారం, సాహిత్యప్రభావం పెరిగింది.

జిల్లాలో కమ్యూనిస్టు ప్రచారం రహస్యంగా సాగుతున్న ఈ కాలంలోనే (1941-42) మద్రాసు గిండీ ఇంజనీరింగ్ కాలేజీలో చదువు సాగించిన కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యాడు. యుద్ధ వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొన్నందుకు కాలేజీ నుండి బహిష్కరణకు గురయ్యాడు. మదనపల్లెలో విద్యార్థిగా కొనసాగాలనే పార్టీ నిర్ణయం ప్రకారం మదనపల్లె కాలేజీలో చేరడానికి చేసిన ప్రయత్నం విఫలం కావడంతో చదువుకి స్వస్తి చెప్పి స్వంత జిల్లా కర్నూలులో పార్టీ ఆర్గనైజరుగా నియమించబడ్డాడు. 1941 చివరలో జిల్లా పార్టీ బాధ్యతలు చేబట్టాడు. కమ్యూనిస్టు ప్రచారాన్ని తీవ్రతరం చేసి పార్టీ నిర్మాణ కృషికి పూనుకొన్నాడు. కమ్యూనిస్టు సిద్ధాంత వ్యాప్తికీ, కమ్యూనిస్టు పార్టీ శాఖల విస్తరణకు కృషి చేశాడు. పీడిత ప్రజలను సంఘటితపరిచాడు. మధ్యతరగతి జీవిత విధానాన్నుంచి శ్రామికవర్గ జీవన విధానానికి మార్పు తీసుకొన్నాడు. కష్టజీవులతో కలసి జీవించాడు.

కామ్రేడ్స్ పుల్లారెడ్డి, మండ్ల సుబ్బారెడ్డి, ఎ. సుదర్శనవర్మలు జన్మించిన వెలుగోడు గ్రామం ఆంధ్ర కమ్యూనిస్టు ఉద్యమంలో పేరుగల ఒక స్థానాన్ని పొందింది. పెత్తందారుల దౌర్జన్యాలను తట్టుకొని నిలబడింది. కమ్యూనిస్టు ఉత్తమ పుత్రులనందించింది.

కర్నూలుజిల్లా ఇంకా అనేకమంది నాయకులను కమ్యూనిస్టు ఉద్యమానికి అందించింది. కామ్రేడ్ నీలం రాంచంద్రయ్య తదితరులు ఈ జిల్లా ఉత్తమపుత్రులే. ఇలాంటి అనేకమంది కామ్రేడ్స్‌ను పట్టుకొని ప్రభుత్వం తుపాకిగుళ్లకెరజేసింది.

1941-42 ప్రాంతం నుంచి కమ్యూనిస్టు పార్టీ పీడిత ప్రజాఉద్యమాలకు నారుపోసి పెంచింది. కర్నూలు జిల్లా కమ్యూనిస్టు పార్టీ ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై వత్తిడి చేసే కార్యక్రమాలు చేపట్టింది. ఫాసిస్టు యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాయుద్ధ విజయం కోసం ప్రచారం చేసింది. ప్రజలను చైతన్య వంతులను చేస్తున్న కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలు, ఆందోళనోద్యమాలు బ్రిటీష్ ప్రభుత్వాన్ని కలవర పెట్టాయి. జాతీయ ప్రభుత్వం ఏర్పాటు కోసం, జాతీయ నాయకుల విడుదల కోసం చేసిన ప్రచారం, ఆందోళన ప్రభుత్వంపై వత్తిడిని పెంచాయి. ధరల కంట్రోలు, రేషన్ కార్డులు, బండిపట్టాలు,

**(తరువాయి 7వ పేజీలో)**

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010